

మార్కెట్‌లో వసూలు చేస్తున్న చార్జీలపై రైతు కార్మిక సంఘాల ప్రతినిధి బృందం పరిశీలన

నవతెలంగాణ-కాశిబుగ్గ

పంజాబ్, హర్యానా, చండీగఢ్ ప్రాంతాలలోని వ్యవసాయ మార్కెట్‌లలో వసూలు చేస్తున్న చార్జీలను మంగళవారం తెలంగాణ రైతు, కార్మిక సంఘాల ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ హర్యానా, పంజాబ్, చండీగఢ్ లలోని వ్యవసాయ మార్కెట్లలో గత రెండు రోజులుగా తమ బృందం రైతుల నుండి వసూలు చేస్తున్న చార్జీలను అదేవిధంగా కార్మికులకు చెల్లిస్తున్న చార్జీల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఆయా రాష్ట్రాల లోని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శులను, కమిషన్ ఏజెంట్లను, రైతులను కలుసుకొని అక్కడి మార్కెట్ వర్గాలు చెల్లిస్తున్న, రైతుల నుంచి వసూలు చేస్తున్న చార్జీల వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. కార్మికులకు వ్యాపారులు, ప్రభుత్వ ఏజెన్సీలు చెల్లిస్తున్న చార్జీలను సమీక్ష చేసినట్లు తెలిపారు. గత రెండు రోజులుగా ఆయా మార్కెట్లలో పరిశీలించిన అంశాలను మీడియా ద్వారా వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులకు తెలియజేస్తామని చందర్‌రావు తెలిపారు. పంజాబ్ హర్యానా చండీగఢ్‌లలోని వ్యవసాయ మార్కెట్‌ల పరిశీలనకు వెళ్లిన వారిలో దడువాయి యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్‌రెడ్డి, కార్యదర్శి నేనావత్ రవికుమార్, ఉపాధ్యక్షుడు వాసం సంజీవ కుమార్, కోశాధికారి బోనాల వీరన్న, ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ బంగు, ఆయా రాష్ట్రాల రైతు సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

రోడ్డు పనులతో పంట పొలాలకు నష్టం..

- కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-వర్ధన్నపేట





ఇల్లంద నుండి చంద్రుతండా పర్వతగిరి వైపు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనుల్లో రైతుల పొలాలకు ఇబ్బందిగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్ బి రోడ్డు పనులు, రోడ్డుకు ఇరువైపులా జేసీబీతో పొలాలను ఇష్టానుసారంగా తోడుతున్నారని, వెడల్పులో భాగంగా తీస్తున్నామని చెబుతూ ఎక్కువ వెడల్పు తీస్తూ పంట పొలాలకు నష్టం చేస్తున్నారని, జిల్లా అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని రైతులు వాపోతున్నారు పనులు చేపడుతున్న నిర్వాహకులను ఈవిషయంపై అడుగగా నిర్లక్ష్య సమాధానంతో పాటు తాము ఇలాగే చేస్తామని ఎవరికైనా చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతులు పెంచాల శ్రీనివాస్, నరసయ్య, రాజు పలువురు రైతులు తెలిపారు. పంట పొలాల పక్కన తీసిన మట్టినే వేరొక చోట రోడ్డుపై పోసి చేతులు దులుపుకుంటున్నారని, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, వాహనదారులు స్థానిక గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నాణ్యతతో కూడిన మట్టిని తెచ్చి రోడ్డు సక్రమంగా నిర్మించవలసిన సంబంధిత కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. రోడ్డు వెంట ఉన్న మిషన్ భగీరథ పైపులు పగిలి లీకేజీ అవుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని పట్టించుకోవాల్సిన సంబంధిత ఏఅధికారి ఇటువైపు చూడడం లేదని బాటసారులు ఆరోపిస్తున్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరుతున్నారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులను వివక్షతతో చూడకూడదు

- ఎంపీడీవో నరసింహామూర్తి
- హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

నవతెలంగాణ-నల్లబెల్లి



హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వివక్షతతో చూడకూడదని ఎంపీడీవో నరసింహామూర్తి అన్నారు. మండలంలోని బోల్లోనిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వైఆర్‌జికేర్ లింక్ వర్కర్ స్కీన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లబెల్లి ఎంపీడీవో నరసింహామూర్తి హాజరై హెచ్‌ఐవీ వ్యాధి ఒకరి నుండి ఒకరికి నాలుగు పద్ధతుల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందని, . అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీ ఉన్న తల్లిదండ్రుల నుండి పుట్టబోయే పిల్లలకి, పరీక్షించని రక్త మార్పిడి పద్ధతి, కలుషితమైన సూదులు, సిరంజిల ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. ఇతర ఏ పద్ధతుల ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి అనేది జరగదన్నారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపకూడదని, వివక్షత చూపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్ స్కీం గ్రామాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబి, సుఖ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. ఈకార్యక్రమంలో వైఆర్‌జికేర్ లింక్ వర్కర్ స్కీం సూపర్‌వైజర్ రజిని, ఎంపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, క్లస్టర్ లింక్ వర్కర్ వీరన్న గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ యువకులు, వాలెంటర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరూరికి నాయకుల పరామర్శ.



నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పట్టా పురం ఏకాంతం, మండలంలోని ఇస్లావత్ తండా గ్రామపార్టీ అధ్యక్షులు భూక్య భాస్కర్‌లు మాజీ ఎమ్మెల్యే ఆరూరిని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరితో పాటు నాయకులు తాటికాయల నర్సయ్య, చీమల చంద్రయ్య, భూక్య రమేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com

మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

నవతెలంగాణ-కాశిబుగ్గ




కాశిబుగ్గలోని శ్రీకాశీ విశ్వేశ్వర ఆలయంలో జరుగు మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈనెల 22నుండి 26వ తేదీ వరకు కాశీవిశ్వేశ్వర ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, కాశిబుగ్గ వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, మాజీ కౌన్సిలర్ దూపం సంపత్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొమురయ్య, బోడకుంట్ల వైకుంఠం, మండల శ్రీరాములు, బండారి భాస్కర్, జంగం రాజు, ఆలయ పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ మాయాజాలానికి రైతుల చిత్తు..!

- కూలీ ఖర్చులు రావట్లేదని ఆవేదన
- పాట కంటే తక్కువ ధరకే కొనుగోలు
- దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతులు

నవతెలంగాణ-కాశిబుగ్గ



మార్కెట్ మాయాజాలానికి రైతులు మరోసారి చిత్తవుతున్నారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు భారీ స్థాయిలో మిర్చి వస్తుండడంతో వ్యాపారులు అమాంతం ధరలు తగ్గించేస్తున్నారు. జెండా పాట కంటే తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తమకు కనీసం కూలీ ఖర్చులు కూడా రావడం లేదని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి కళ వచ్చేసింది. భారీగా సరుకు తరలిరావడంతో మార్కెట్ మొత్తం మిరప బస్తాలతో నిండిపోయింది. కాని ఇక్కడి వ్యాపారులు ధరలు తగ్గించడంతో రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కు వెళ్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే మిర్చి ధరలు భారీగా పడిపోయాయి. గత ఏడాది ఇదే నెలలో క్వింటా మిర్చి రూ. 22వేలు ధర పలుకగా ఈసారి అత్యధికంగా రూ.13వేలు మాత్రమే పలికింది. మిరప రకాలను బట్టి వ్యాపారులు సరుకు కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడును విపరీతంగా పెరిగి ఒక్కో ఎకరానికి రూ.1లక్ష 50వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పండించిన పంటను అమ్మేందుకు మార్కెట్ కు వస్తున్న రైతులను వ్యాపారులు రకరకాల మోసాలతో ధరలు అమాంతం తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. జెండా పాట తరువాత రైతులు తెచ్చిన సరుకు నమూనాను ఒకటి, రెండు బస్తాలు కోసి పరిశీలించి సరుకును బట్టి ధర నిర్ణయిస్తారు. రైతుకు ఇష్టం ఉంటే అమ్ముకోవచ్చు లేకపోతే లేదు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. కాని సరుకును బట్టి ధరను నిర్ణయించిన తర్వాత కాంటాలు వేసే సమయంలో వ్యాపారులు కొర్రీలు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అసలు సరుకును కొనబోమంటూ తెగేసి చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత సంవత్సరం మిర్చి పంటకు మంచి ధర పలకడంతో ఈసారి రైతులు పెద్ద ఎత్తున సాగు చేశారు. అయితే అకాల వర్షాలు, చీడ పురుగు వల్ల కొన్నిచోట్ల నష్టం జరిగింది. సోమవారం మార్కెట్ కు వచ్చిన మిర్చిని పరిశీలిస్తే తేజ రకం మిర్చి 17వేల బస్తాలు రాగా అత్యధిక ధర రూ.13,800 పలుకగా, వండర్ హాట్ 2100 బస్తాలు రాగా అత్యధికంగా రూ.16వేలు యూఎస్-341 9500 బస్తాలు లాగా అత్యధిక ధర రూ.13,500, దీపిక 50బస్తాలు రాగా అత్యధిక ధర రూ.17,200 పలికింది. అయితే గతంతో పోలిస్తే ఈసారి ధరలు భారీగా పతనమైనట్లు తెలుస్తుంది. 2021 ఫిబ్రవరిలో అత్యధికంగా క్వింటా మిర్చికి ధర రూ.24వేలు పలుకగా 2022లో రూ.29వేలు, 2023లో రూ.73వేలు, 2024లో రూ.22,100 ధర లభించింది.


కూలీ ఖర్చులు రావడం లేదు



34 బస్తాల మిర్చి తీసుకువచ్చాను. ధర రూ.13వేలు పలికింది. గత ఏడాది మిర్చికి రూ.21వేలు ఉన్నది. ఈసారి పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేటట్లు లేవు. ఎకరంన్నర భూమిలో మిర్చి సాగు చేస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే దిగుబడి పెరిగింది కాని ధర మాత్రం తగ్గింది.

-శక్రునాయక్ మిర్చి రైతు, పోచంపల్లి పెద్ద వంగర

రూ.20వేలు ఉంటేనే ధర గిట్టుబాటు



క్వింటా మిర్చి ధర రూ. 20వేలు పైగా ఉంటేనే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పెట్టుబడి కూలీల ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఒక్కో కూలీకి రూ.300 చెల్లిస్తున్నాం. 17 బస్తాల మిర్చిని తీసుకువస్తే రూ.13000 ధర పలికింది. నల్లి పురుగు రావడం వల్ల దిగుబడి తగ్గింది.

-జాను, టీబీతండా జఫర్‌గఢ్

కల్తీ లేని పెట్రోల్, డీజిల్ అందించడమే జైలు శాఖ ఉద్దేశం



- జైలు శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా

నవతెలంగాణ-వరంగల్

కల్తీ లేని పెట్రోల్ అందించడమే జైలు శాఖ ఉద్దేశ్యమని జైలు శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా అన్నారు. వరంగల్ మామునూరు కారాగారం ఆవరణంలో జైలు శాఖ ఆధ్వర్యంలో స్థాపింపబడిన నూతన పెట్రోల్ బంక్‌ను మంగళ వారం జైలు శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి సౌమ్య మిశ్రా మాట్లాడుతూ జైలు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పెట్రోల్ బంకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ ప్రజలకు అందజేస్తుందని, బంకుల్లో విడుదలైన ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ ఖైదీలలో సత్ప్రవర్తన తీసుకొని వస్తూ వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ జైలు శాఖ ఆసరాగా నిలుస్తుందఅన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా పెట్రోల్ బంకులను నిర్వహించడం జైలు శాఖ ముఖ్య ఉద్దేశ్యమని డీజీ అన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రేంజ్ డీఐజీఎం సంపత్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదలు హాజరయ్యారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ కస్టమర్లకు ఎలాంటి కల్తీ లేని నాణ్యమైన సేవలు అందించడమే కాకుండా ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ జైలు శాఖ పనితీరు ప్రశంసనీయమని కొనియాడారు. ఈకార్యక్రమంలో కేంద్ర కారాగారం వరంగల్ పర్యవేక్షణ అధికారి టి.కళాసాగర్, ఉప పర్యవేక్షణ అధికారులు పి.వెంకటేశ్వర స్వామి, ఎం.జ్యోతి, జైలర్ కె.పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

తలనీలాల మాయం విషయంపై విచారణ



- మైనార్టీ అధికారికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ప్రముఖ యాత్ర స్థలమైన అన్నారం షరీఫ్ దర్గాలో మహిళల పెద్ద తలనీలాలు మాయమయ్యాయి. చిన్న పిల్లల తలనీలాలు మాత్రమే చూపించినట్లు వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ రియాజ్ రూ.30లక్షల సరుకు చాటుగా అమ్ముకొని రూ.5 లక్షలు మాత్రమే వక్ఫ్ బోర్డులో జమ చేసి ఇక్కడకు చెందిన క్షౌరకుడితో కుమ్మక్కై, సుబ్బారావు అనే వ్యక్తికి అమ్మి వక్ఫ్ బోర్డు ఆదాయానికి గండి కొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇట్టి విషయంపై జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి ఆదేశాల ప్రకారం మంగళవారం జిల్లా మైనారిటీ అధికారి టి.రమేష్ చేపట్టిన విచారణలో తల నీలాల మాయయ్యాయని చెబుతున్నారు. గ్రామ ప్రజల సమక్షంలో విచారణ, తల నీలాల దొంగతనం చేసిన సుబ్బారావుపై ఇక్కడ సహకరించిన ఒక క్షౌరకుడిపై అలాగే వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ పై కేసు నమోదు చేసి చట్టపరమైన విచారణ చేసి, తల నీలాలను రికవరీ చేయాలని గ్రామస్థులు మైనార్టీ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఇట్టి ప్రాథమిక విచారణ నివేదికను త్వరలో జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని మైనార్టీ అధికారి టి.రమేష్ తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే తల నీలాల అమ్మకం

-వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ రియాజ్ పాషా

ప్రముఖ యాత్ర స్థలమైన అన్నారం షరీఫ్ దర్గాలో తల నీలాలు మాయమయ్యానని వస్తున్న ఆరోపణల కారణంగా మంగళవారం నవతెలంగాణ రిపోర్టర్ ఫోన్‌లో వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ రియాజ్ పాషాను వివరణ కోరగా ఆయన చెప్పిన మాటల్లో .. వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోనే వారి ఆదేశాల మేరకే తల నీలాలు సుబ్బారావుకు ఇచ్చినట్లు వక్ఫ్ బోర్డు ఆయన తెలిపారు. ఇందులో ఎవరి ప్రమేయం లేదని, సంబంధిత కాంట్రాక్టర్ సుబ్బారావు అనే వ్యక్తి నేరుగా హైదారాబాద్‌లోని వక్ఫ్ బోర్డు కార్యాలయానికి వెళ్లి అక్కడ ఉన్న వక్ఫ్ బోర్డు అధికారులను కలిసి అనుమతి తెచ్చుకోవడంతో నేను తల నీలాలు సుబ్బారావుకు ఇచ్చినట్లు తెలిపారు. మిగతా తల నీలాలు భద్రంగానే ఉన్నాయని వస్తున్న ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని చెప్పారు.

సీపీఐ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

నవతెలంగాణ-కాశిబుగ్గ



వందేళ్ల ఘనమైన చరిత్ర కలిగిన సీపీఐ పార్టీ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆపార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్ లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వీరగోని శంకరయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మేకల రవి మాట్లాడుతూ మనిషిని మనిషి దోచుకోలేని వ్యవస్థ నిర్మాణం కావాలన్న ఆశయంతో మార్క్సిజం, లెనినిజం పునాదులపై ధనిక, పేద అనే తేడాలేని సమాజ నిర్మాణం కోసం సీపీఐ పార్టీ ఏర్పడిందన్నారు. గత 99 సంవత్సరాలుగా అనేక అక్రమ కేసులు, కుట్ర కేసులు, జైలు, నిర్బంధాలు, బలిదానాలు, త్యాగాలు చేసిన ఘనమైన చరిత్ర సీపీఐ పార్టీకే ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీగా, ప్రజల పక్షంగా ఉంటూ రానున్న రోజులలో పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వరంగల్ జిల్లాలోని ప్రతి పల్లెలో సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జరుపాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈనెల 25న వరంగల్ నగరంలో జరుగుతున్న జిల్లాస్థాయి శతాబ్ది ఉత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈసమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.కె బాష్మియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, సంఘీ ఏలేందర్, మునీశ్వరుడు, తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలి

- నగర మేయర్ గుండు సుధారాణి

నవతెలంగాణ-వరంగల్

తడి పొడి చెత్తను వేరు చేసి అందించాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్, మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణి నగర వాసులను కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో గల బయోగ్యాస్ ప్లాంట్ ను మేయర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ప్రజలందరూ ప్రతిరోజూ తడి, పొడి చెత్తను వేరు చేసి కార్పొరేషన్ తరపున తమ నివాస ప్రాంతాలకు చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు అందించాలని, నగర వాసులు చెత్తను వేరు చేసి అందించడం ద్వారా తడి చెత్తతో కంపోస్టు (ఎరువు) ను తయారు చేసి వచ్చిన కంపోస్టును కార్పొరేషన్ ఆవరణలో హార్టికల్చర్ విభాగం ద్వారా మొక్కల పెంపకానికి వాడుతున్నామని, కార్పొరేషన్ లో బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా గ్యాస్ ను ఉత్పత్తి చేసి దాని నుండి వచ్చే విద్యుత్‌ను ప్రతి రోజూ రెండు గంటల పాటు విని యోగించడం జరుగుతుందని గుండు సుధారాణి అన్నారు. పొడిచెత్తను నగరంలోని డీఆర్సీసీ కేంద్రాలకు, అక్కడ నుండి దేశం లోని వివిధ రీ సైక్లింగ్ కేంద్రాలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈశానిటేషన్ నిర్వహణలో ప్రజలందరు సహకరించి ప్రజల ఆరోగ్యాలతో పాటు పర్యావరణ కాలుష్యం నుండి కాపాడడంలో కార్పొరేషన్‌కు సహకరించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయడం వల్ల తడి చెత్తను కంపోస్టు గాను, పొడి చెత్తను రీ సైక్లింగ్‌కు పంపించడం ద్వారా డంప్ యార్డుకు చేరే చెత్త పరిమాణం గణనీయంగా తగ్గుతుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగర ప్రజలు ముందుండాలని కోరారు.



మిస్సింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపురం



తోటి విద్యార్థులతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొని భయభ్రాంతులకు గురైన విద్యార్థి ఎవరికీ చెప్పకుండా హాస్టల్‌ను వదిలి వెళ్లిపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును మంగళవారం నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్.రఘుపతి తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించిన వజ్జ నారాయణ కుమారుడు సాయివర్ధన్ అశోక్‌నగర్ గ్రామంలోని సైనిక్ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. ఇదే తరుణంలో తోటి విద్యార్థులతో జరిగిన గొడవను మనసులో పెట్టుకొని భయభ్రాంతులకు గురై ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుండి వెళ్లిపోయినట్లు వారు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తప్పిపోయిన విద్యార్థి వైట్ టీషర్ట్ వేసుకొని లోయర్ ధరించి ఉన్నాడని, ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే 8712685234, 8712585025 మొబైల్ నెంబర్లకు కాల్ చేసి వివరాలు అందించాలని కోరారు.

విద్యార్థి ఆచూకీ చేపట్టాలని

ఎబీఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకుల డిమాండ్



గిరిజన సైనిక్ స్కూల్ యాజమాన్యం తప్పిదం వల్లనే ఇంటర్మీడియట్ విద్యార్థి సాయి వర్ధన్ మిస్సింగ్ అయ్యాడని వెంటనే పోలీస్ అధికారులు విచారణ చేపట్టి ఆచూకీ తెలియచేయాలని ఎబీ ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బోట్ల నరేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు, పాఠశాల సిబ్బంది లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తూనం స్వామికి సన్మానం..



నవతెలంగాణ-ఖానాపురం

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన తూనం స్వామిని మంగళవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ నాయకులు రాష్ట్ర నాయకులు రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శాలువా కప్పి సన్మానించారు.. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, పార్టీలో నిబద్ధత కలిగిన నాయకుడిగా ముందుకు సాగుతానని తెలిపారు. సహకరిస్తున్న మండల పార్టీ ప్రజాప్రతినిధులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పై ఇంతేజార్ గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఎలాంటి అనుమతులు లేకుండా పోచమ్మ మైదాన్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించడం వల్ల ట్రాఫిక్ జామ్ కావడంతో 223(ఏ), 127 బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్ గంజ్ సీఐ సుకుర్ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణం కోసం విరాళం

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని గోపన పల్లిలోని శ్రీ దూడల మల్లి కార్జున స్వామి ఆలయ అభివృధి పునర్నిర్మాణంలో భాగంగా శ్రీ దూడల మల్లి కార్జున స్వామి ఆలయ అభివృద్ధి కమిటీకి గ్రామానికి చెందిన కీ.శే. గుండమాల ముత్తయ్య-రామక్క జ్ఞాపకార్థం వారి కొడుకు కోడలు దూడయ్య-భాగ్యమ్మలు మంగళవారం ఆలయ పునర్నిర్మాణానికి రూ.10,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బెల్లం రాధిక రాజు తెలిపారు.

సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి

- మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు



నవతెలంగాణ-కమలాపూర్

గతంలో కుల గణన సర్వేలో వివరాలు నమోదు చేసుకొని వారు ఈనెల 28 వరకు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎంపీడీవో గుండె బాబు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో కులగణన సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు ఈనెల 28వరకు తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలు నమోదు చేసుకోని వారికోసం మూడువిధాలుగా ప్రణాళికా శాఖ అవకాశాన్ని కల్పించారన్నారు. seeepvsurvey.cgg.gov.in వెబ్సైట్లో సర్వే దరఖాస్తును డౌన్లోడ్ చేసుకుని నింపి, యజమాని సంతకం చేసి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలలోపు అందించాలన్నారు. రెండోది నేరుగా మీఆధార్‌కార్డులు, బ్యాంక్ పాస్‌పుస్తకాలు, పట్టాదారు పాసుబుక్కులు మొదలైన మిగతా వివరాలతో ఎంపీడీవో అందించాలన్నారు. మూడవది మీ మొబైల్ నుండి 04021111111 నెంబర్‌కు ఫోన్‌చేసి మీ వివరాలు నమోదు చేసుకొనుటకు కోరినట్లయితే ఎన్యూమరేటర్లు నేరుగా మీ ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని నమోదు చేసుకొని వారు వినియోగించుకోవాలని కోరారు.

అనంతరం పల్లెలో పశువుల షెడ్డును, అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో భోజనం చేశారు.

ఏజెన్సీ డీయస్సీలో అవకతవకలకు పాల్పడిన డీఈఓపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

2008 డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చివరకు పేర్లు తొలగించి అన్యాయం చేసిన డీఈవో వాసంతిపై చర్యలు తీసుకుని సెలెక్ట్ అయిన అభ్యర్థులను ఉద్యోగాలు కల్పించాలని ఎన్‌టీవీఎస్ నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు భానోత్ రామన్ననాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా తమ ఉద్యోగాలు తమకు వస్తాయని ఎన్నో ఆశలతో ఎదురుచూసిన ఇటీవల ప్రభుత్వం 2008 డియస్సీకి ఎంపికైన అభ్యర్థులను కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేయడంలో 2024 సెప్టెంబర్ లో విద్యాశాఖ కార్యాలయంలో నమూనా ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగింది. కానీ చివరకు జె సోమ్లా, ఈ.వెంకన్నపి, శంకర్,ఈ.రాములు,బి.వాల్య, బి.రవీందర్, రామ్మూర్తి సిహెచ్ భాస్కర్ గణేష్‌లకు అన్యాయం చేస్తూ వారి పేర్లను తొలగించారని డీఈవో వాసంతి పై చర్యలు తీసుకుని గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఇస్లావత్ వెంకన్న, సోమ్లా, ఇస్లావత్ రాములు, గూగుల్ సంజీవ్ కుమార్, బోడ రవీందర్, పోరిక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఎల్కతుర్తి

బస్టాండ్ ప్రాంతంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద కుడా అభివృద్ధి పనుల కారణంగా బుధవారం ఉదయం 11గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సుధాకర్ తెలిపారు. ఎల్కతుర్తి గ్రానైట్ ఫీడర్, ఎల్కతుర్తి ఎక్స్‌ప్రెస్ ఫీడర్, ఎల్కతుర్తి టౌన్ ఫీడర్ ఎల్కతుర్తి గ్రామీణ ఫీడర్ పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ పరిసరాలతో పాటు గ్రామంలో కరెంట్ సప్లై ఉండదని, వినియోగదారులందరు సిబ్బందికి సహకరించాలని సూచించారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ-నయీంనగర్

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 56వ డివిజన్ లోని వెటర్నరీ కాలనీలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల వేడుకలను సేవాలాల్ గోర్ బంజారా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ వేడుకలను పురస్కరించుకొని సునీల్‌కుమార్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి ఉత్సవాల్ని ప్రతి సంవత్సరం డివిజన్లో జరుపుటకు నా పూర్తి సహకారాన్ని అందించడం జరుగుతుందని తెలియజేశారు. సేవాలాల్ బంజారాల ఆరాధ్య దైవం ,వారి శ్రేయస్సు కోసం పని చేయడంతోపాటు సమాజంలో అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ప్రజల కష్టాలలో వారికి తోడుగా నిలబడిన మంచి నాయకత్వ విలువలు కలిగిన వ్యక్తి అని తెలియజేస్తూ అందరికీ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బానోతు వీరు నాయక్, మాలోతు బొజ్జా నాయక్, దేవ్ సింగ్ ,యాకూబ్, రాజు నాయక్, వినోద్ లోక్ నాయక్, సురేష్ లాల్, వీరమ్మ, దేవేందర్, హేమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌తోనే వివో లోపాలు గుర్తింపు

- వివో తప్పిదాలకు వివో ఏలు, ప్రతినిధులే బాధ్యులు.
- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు
- ప్రతి రూపాయికి సరియైన ఆధారాలు చూపాలి.
- వర్ధన్నపేట ఏపీఎం వీర్ల వేణు, సీబీఓ వెంకట్



నవతెలంగాణ-వర్ధన్నపేట

గ్రామైక్య సంఘాలలో నెలసరి జరిగే లావాదేవీలలో పొరపాట్లు జరిగితే వివో సహాయకులు (వివో ఏలు), వివో ప్రతినిధులే బాధ్యత వహించాలని డిఆర్డిఏ ఏపీఎం వీర్ల వేణు, సిబిఓ ఆడిటర్ వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో సెర్ప్ కార్యాలయంలో ఉప్పరపల్లి నల్లబెల్లి, కట్ర్యాల, సంగెం మండలంలోని వెంకటాపూర్ , నల్లబెల్లి గ్రామాల గ్రామైక్య రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 2024 నుండి సెప్టెంబర్ 2024 వరకు జరిగిన లావాదేవీలను డిఆర్డిఓ కౌసల్యాదేవి ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామైక్య సంఘాలను రికార్డులను తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. సభ్య సంఘాల వసూలు చెల్లింపులకు సరియైన ఆధారాలు చూపాలని అన్నారు. అలాకాకుండా విధుల పట్ల అలసత్వం వహిస్తే సంబంధిత వివోఏలు వివో ప్రతినిధుల పై చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తించిన లోపాలను పై అధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. ఈ తనిఖీల్లో వారి వెంట సీసీలు గోలి కొమురయ్య, స్వామి, స్త్రీ నిధి మేనేజర్ కపిల్, వివోఏలు, ప్రతినిధులు కట్ల రజిత భవాని వివో ఏలు బిర్రు దయాకర్, మంజుల బిక్షపతి, రాము, రాజా, రాణి, ఎంఎస్ అకౌంటెంట్ రేవతి, సిఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ మేనేజర్‌గా సింధురెడ్డి



నవతెలంగాణ-ఎల్కతుర్తి

మలేసియాలో జరిగిన సదస్సు లో నవ క్రాంతి రైతు ఉత్పత్తి దారుల సంస్థలో పనిచేస్తున్న వర్ణ సింధూ రెడ్డిని ఉత్తమ పియు మేనేజర్‌గా ఎంపిక చేసి అవార్డు అందజేశారు. ఉత్తమ ప్రాజెక్టుగా నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ను ఎంపిక చేయడం జరిగింది. ఈ అవార్డులను నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తరపున ప్రాజెక్టు కోఆర్డినేటర్ బొట్ల సతీష్ కుమార్ మలేషియా దేశంలో స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వర్ణ సింధూ రెడ్డిని, ఉత్తమ ప్రాజెక్టు గా నిలబెట్టిన బొట్ల సతీష్‌కుమార్, సిబ్బందిని వివిధ దేశాల ప్రతినిధులు మరియు నవ క్రాంతి రైతు ఉత్పత్తి ధారుల సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది , సభ్యులు, రైతులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా అసోసియేట్ డైరెక్టర్ పుల్లూరి వంశీకృష్ణ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ బొట్ల సతీష్ కుమార్, పియు మేనేజర్ మహేందర్, భారతదేశం, వివిధ దేశాలకు చెందిన 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గడ్డ సమాధులను కాపాడుకుందాం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

గత కొన్ని నెలలుగా పెద్దమ్మ గడ్డ సమాధులను కొంత మంది వ్యక్తులు నకిలీపత్రాలు సృష్టించి ఆక్రమించడానికి యత్నిస్తున్నారని సమా ధుల గడ్డను పరిక్షించుకుంటామని పెద్దమ్మగడ్డ వాసులు రాపాక వేణు మనోహర్, హనుమకొండ కృష్ణయ్య, దరిగి శ్రీనివాస్, పల్లె విక్రమ్, రాప్సన్, రాపాక వాసులు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దమ్మ గడ్డ వాసులం అందరం ఐక్యంగా పోరాడి పార్టీలకతీతంగా నడుం బిగించి మన సమాధులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తెలిపారు.

పెద్దమ్మగడ్డ గ్రామ ప్రజలకు పాత సమాధుల గడ్డ చాలా విలువైనది అయినా దానిని కొందరు దొంగ కాగితాలను సృష్టించడం జరిగింది. సమాధులు ఉండంగా సమాధులను కూల్చి కబ్జాచేస్తున్నారు. ఐక్యంగా ముందుకుసాగి సమాధుల స్థలాన్ని కాపాడుకోవాలని కోరారు. పెద్దమ్మ గడ్డ సమాధులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.

రైతులకు సౌరశక్తి యూనిట్లు



- దరఖాస్తులకు ఈనెల 22 వరకు అవకాశం

నవతెలంగాణ-ధర్మసాగర్

సాగుకు యోగ్యంగా లేని భూముల్లో రైతులు సౌర శక్తి యూనిట్లు నెలకొల్పేం దుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా బంజరుభూముల్లో యూనిట్లు ఏర్పాటు చేసుకొని సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయ డానికి ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, టీజీ రెడ్కో సంయుక్తంగా సౌరశక్తి గురించి అవగాహన కల్పిస్తున్నారు. ఈనెల 22వరకు ఆసక్తికలిగిన రైతులు దరఖాస్తులుచేసుకోవచ్చు.

అర్హులు ఎవరంటే..

రైతులకు ఏదో రకంగా ఆదాయం కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఒక సారి యూనిట్ ఏర్పాటు చేసుకుంటే 25 ఏళ్ల వరకు నిరంతరాయంగా ఆదాయం సమకూరుతుంది. వారికి టీజీ ఎన్పీడీసీఎల్, తెలంగాణ ఎలక్ట్రిసిటీరెగ్యులేటరీ కమిషన్ నిర్ణయించిన టారిఫ్ ప్రకారం రైతుల నుంచి విద్యుత్తు కొనుగోలు చేస్తారు. 4 మెగావాట్ల సామర్థ్యం ఉన్నవి సామూహికంగా ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది. రైతులు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, రైతుసంఘాలు, నీటితీరువా సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, రైతుల భూములు లీజుకుతీసుకున్నవారు వీటిని ఏర్పాటు చేసుకోవడానికి అర్హులు.

ఉప కేంద్రానికి సమీపంలో ఉంటే.. ...

రైతుల భూములు 33/11 విద్యుత్తు ఉప కేంద్రానికి సమీపంలో ఉండాలి. యూనిట్ నుంచి ఉప కేంద్రానికి ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసేందుకు ఖర్చు తగ్గుతుంది. 500 కిలోవాట్ నుంచి 2 మెగా వాట్ల సామర్థ్యం వరకు రైతులు ఏర్పాటు చేసుకోవచ్చు. మెగావాట్ సామర్థ్యం యూనిట్ కు 3.5 నుంచి 4 ఎకరాలు అవ సరం.

ఆసక్తి ఉన్న రైతులు www.tgredco.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు టీజీ ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో సంప్రదించాలని ఏఈ శశికాంత్ పేర్కొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి



నవతెలంగాణ-సుబేదారి

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. మంగళవారం ప్రభుత్వ కార్యక్రమాలపై రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్‌లతో వీసీద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించిన సిఎస్ ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని సీఎస్ శాంతి కుమారి అన్నారు. ఈ సమీక్షలో సిఎస్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా సరఫరా కొనసాగించాలని, రైతుభరోసాపై గ్రీవెన్స్ సెల్ ను జిల్లాలలో ఏర్పాటు చేయాలని, రోజులలో అదనపు భూ వివరాల నమోదు పోర్టల్ లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను వినియోగించుకొని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని, వేసవిలో త్రాగు నీటి సరఫరా ఇబ్బందులు రాకుండా చర్యలు ఎన్నికలకోడ్ తర్వాత రేషన్ కార్డుల పంపిణీకి సన్నద్ధం కావాలన్నారు. ప్రజలు పదే పదే రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మా ట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య లేదని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా చేతిపంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీడబ్ల్యుఎంసీ పరిధిలోని డివిజన్లకు ధర్మసాగర్ నుండి నీటి సరఫరాను చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 24 నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి

- హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలన నిరోధానికి కృషి చేస్తామని హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ అన్నారు. మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫోరం నెట్‌వర్క్, ఎన్జీవోస్ ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సహకారంతో రూపొందించిన మానవ అక్రమ రవాణా వెట్టిచాకిరి నిర్మూలనపై రూపొందించిన పోస్టర్స్ కరపత్రాలను ఆర్డీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఇంకా అనేకరకాలుగా మానవఅక్రమ రవాణా జరుగుతుందని దీనిని నిరోధించడానికి అవగాహన ముఖ్యమని సమాజంలో అన్ని వర్గాలలో అవగాహన కల్పించడానికి అన్నిప్రభుత్వ శాఖల సమన్వయంతో ఎన్జీవోస్ తో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఎవరైనా మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వెట్టి చాకిరి కొరకు వ్యక్తులను రవాణా చేసినా, నియమించుకున్నా ఆయా చట్టాల ప్రకారం శిక్షించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా వెట్టి చాకిరీ, అక్రమ రవాణా గాని గుర్తైతే 100 పోలీస్ 1098 కు సమాచారం ఇచ్చి సహకరించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వైవీ.గణేష్, హనుమకొండ వయోవద్దుల ట్రిబ్యునల్ మెంబర్ డాక్టర్ అనిత రెడ్డి, సీడబ్ల్యుసీ చైర్‌పర్సన్ అన్నమనేని అనిల్ చందర్‌రావు, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, కె.దామోదర్, హైమవతి, హనుమకొండ డీసీపీఓ ఎస్.ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, స్వర్ణ భారతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాలడుగుల సురేందర్, బాల కార్మికుల నిర్మూలన పథకము ప్రాజెక్టు డైరెక్టర్ బుర్ర అశోక్ కుమార్, డాన్ బాస్కో నవజీవన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి సంతోష్ కుమార్, కో-ఆర్డినేటర్లు రాజు శారద తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా



- ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

నవతెలంగాణ-నక్కలగుట్ట

హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతి రెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ,జెఎన్‌టీయూహెచ్ స్వయంప్రతిపత్తి హోదా ప్రకటించినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. కాకాజీ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలోని కళాశాలకు ధీటుగా సుమతిరెడ్డి కళాశాల విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా టెక్నాలజీలో రాణిస్తున్నారన్నారు. దేశంలోనే ముఖ్యనగరాల్లోని కళాశాలకు ధీటుగాసుమతిరెడ్డి కళాశాల విద్యార్థులకు కావాల్సిన మెలకువలు నేర్పించి వివిధ రంగాల్లో రాణించుటకు దోహదం చేస్తున్నామని దేశ విదేశాలలో గల వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో సుమతి రెడ్డి కళాశాల విద్యార్థినీలు ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ప్రపంచంలో గల వివిధ దేశాలలో కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను కలిగి ప్రతిష్టాత్మక సంస్థలు పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నారని, పూర్వవిద్యార్థులు వివిధదేశాలలో పనిచేస్తూ కళాశాల ప్రతిష్ఠను నిలుపుతున్నారన్నారు. వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ మహేందర్, ఎస్.శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్‌స్వామి, మధుకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ గాజా శ్రీరెడ్డి, అధ్యాపక బందం విద్యార్థినిలకు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

రామన్ విద్యార్థులకు గణిత ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకులు



నవతెలంగాణ-నయీంనగర్

తెలంగాణ రాష్ట్ర ఎసోసియేషన్ ఫర్ మేథ్స్ టీచర్స్, హైదరాబాదు గత నెలలో గణితంలో అన్ని తరగతుల పాఠశాల విద్యార్థులకు ప్రతిభాన్వేషణ ఒలింపియాడ్ నిర్వహించి, నిన్న రాత్రి ఫలితాలను రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసింది. సుబేదారిలోని రామన్ ఉన్నత పాఠశాలలో, రాష్ట్రంలో మెరుగైన ఫలితాలను పొందిన విద్యార్థులను మంగళవారం పాఠశాల యాజమాన్యం పుష్పగుచ్ఛములనిచ్చి అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ రాజేష్ మాట్లాడుతూ రామన్ విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సబ్ జూనియర్ కాటగిరిలో మిథాంష్ రెడ్డి 6వతరగతి 3వ ర్యాంకును, జూనియర్ కేటగిరిలో అవినాశ్ రెడ్డి స్టేట్ 1వ ర్యాంకును, శ్రీహర్షిక 2వ ర్యాంకును, యశస్విని 3వ ర్యాంకును, ధార్మిక్ 4వ, యుక్తశ్రీ 5వ, హర్షిత్ 5వ, హర్షద్ తేజ 5వ, అనీష్ చంద్ర 5వ, ఆశ్రిత 5వ, సహజ 5వ, ఖుదిసియా జీనత్ 6వ, సాయి కౌశిక్ రెడ్డి 6వ, లక్ష్యసాయి 6వ, హర్షవర్ధన్ మాలిక్ 7వ, మణిదీప్ 8వ, దీపాన్విత 10వ, సహస్ర 10వ, శ్రీమాన్ 10 వ స్టేట్ ర్యాంకులను, సీనియర్ కేటగిరిలో మోహిత్ రెడ్డి స్టేట్ 2వ, రమణీత్ రెడ్డి స్టేట్ 2వ, అక్షిత 4వ, సూర్యవైష్ణవి 4వ ర్యాంకులను సాధించారని తెలియజేశారు. గణిత శాస్త్రంలో మా పాఠశాల విలువలతో కూడిన విద్యను అందించగలదని మరొక్కసారి తెలియ వచ్చిందని, గణితంలో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు ఫిజిక్స్, రసాయనశాస్త్రం లాంటి ఇతర సబ్జెక్టుల పాఠ్యాంశాలను అలవోకగా అర్థం చేసుకోగలరని పేర్కొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ఫలితాలతో మా బాధ్యత మరింతగా పెరిగిందని అందుకు మా అధ్యాపక బృందం ఎల్లప్పుడూ కృషి చేస్తునే ఉంటుందని తెలిపారు. ఈ ఫలితాలను పొందడానికి కృషి చేసిన అధ్యాపకులు కరుణారెడ్డి , ఇతరులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పురుషోత్తం, ప్రిన్సిపాల్‌లు స్రవంతి, రజితలు పాల్గొన్నారు.

మహిళలకు వ్యక్తిగత రుణాలు అందిస్తాం

- ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం



నవతెలంగాణ-శాయంపేట

పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న మహిళలకు ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయం సమావేశం మందిరంలో పరకాల శాయంపేట నడికుడ మండలాల ఏపీఎంలు, సీసీలు వివోఏలకు ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు లింకేజీ డీపీఎం దాస్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన రీజినల్ మేనేజర్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివద్ధి కోసం మా ఎస్‌బీఐ బ్యాంక్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళ సంఘాల సభ్యులు బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకొని ఎలాంటి బకాయి లేకుండా చెల్లించి మరల రుణం పొందాలన్నారు. ప్రతీ ఒక్కరు ఎస్‌బీఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరు ప్రమాద బీమా ప్రీమియం చెల్లించి రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల వరకు లబ్ధిపొందవచ్చునన్నారు. మహిళ సంఘాలలో ఉన్న మహిళలకు తమ వ్యాపారాల అభివద్ధి కోసం వ్యక్తిగత రుణాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు లింకేజ్ లక్ష్యాలలో 100శాతం లక్ష్యాలు సాధించిన ఉత్తమ ఏపీఎంలకు, సీసీలను, వీవోఏలను అభినందించి బహుమతులు అందజేశారు. అనంతరం శాయంపేట నుండి మహిళ సంఘాల రుణాలతో ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదిగి ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న శాయంపేట మండల కేంద్రానికి చెందిన దాసరి కల్పనను ఎస్‌బీఐ ఆర్ఎం శాలువతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్లు రాజేష్, శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ అనంత రమణాచారి, బ్యాంక్ లింకేజ్ ఏపీఎం రాజు, ఏపీఎంలు శ్రీధర్ రెడ్డి, క్రాంతి, రమాదేవి, సీసీలు కేదారి, విజయ్ కుమార్, ప్రభాకర్, హేమలత, రాజు, కుమారస్వామి, వివోఏలు పాల్గొన్నారు.

మీచెంతకు మరిన్ని సేవలు...



నవతెలంగాణ-నక్కలగుట్ట

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంలో మీ సేవ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ మీసేవా కేంద్రాలు గ్రామీణస్థాయిలో సులభంగా, వేగంగా అనే నినాదంతో పనిచేస్తున్నాయి. గతంలో వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రజలు ఇప్పుడు మీ సేవ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. కులం, ఆదాయం, నివాసం, వ్యవసాయానికి సంబంధించిన సేవలు అందుబాటులోకి తీసుకురావ డంతో.. ప్రజలు, విద్యార్థులు, రైతులు గ్రామాల్లోని ఈ కేంద్రాలలో దరఖా స్తు చేసుకుంటున్నారు. ప్రజల సౌలభ్యం కోసం రెవెన్యూ,వ్యవసాయ, విద్యుత్తు, పోలీసు, మున్సిపాలిటీలు తదితర 38 శాఖలకు సంబంధించిన పలు సేవలు అందుతాయి. సంబంధిత పత్రాలు జతచేసి దరఖాస్తు చేసి, నిర్ణీత సమయంలో ధ్రువప త్రాలను పొందవచ్చు.

కొత్తగా మరో తొమ్మిది....

ప్రభుత్వం ఇటీవల మరో తొమ్మిది సేవలు తీసుకొచ్చింది. చాలా మంది చదువు మధ్యలో ఆపేస్తారు. మళ్లీ కాలేజీల్లో చేరడానికి ఆసక్తి చూపుతుంటారు. వారికి గ్యాప్ సర్టిఫికెట్ కావాలి. తహసీల్దార్ కార్యాలయంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. పేరు మార్పిడి, ప్రభుత్వ ఉద్యోగాల కోసం క్రీమిలేయర్, నాన్ క్రీమిలేయర్ పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్థానిక మైనార్టీ, రీ ఇన్సూరెన్స్ , కులం, ఆదాయం, సీనియర్ సీటిజన్స్ మెయింటెనెన్స్ కేసుల మానిట రింగ్ సిస్టం, అటవీ శాఖ ద్వారా అందే పరిహారం, ఇతర అనుమతి పొందడం వంటవి చేర్చారు.

సద్వినియోగం చేసుకోవాలి...

ప్రజలు, విద్యార్థులు, రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం తొమ్మిది రకాల సేవలను మీసేవ జాబితాలో చేర్చింది. వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రీడోత్సవాలు

నవతెలంగాణ-సుబేదారి

నెహ్రూ యువ కేంద్రం వరంగల్ జిల్లా వారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 17, 18 తేదీ ల లో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా ప్రాంగణంలో హన్మకొండ డిస్ట్రిక్ట్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరిగిందని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు.ఈ క్రీడల్లో గెలుపొందిన యువతి యువకులకు బహుమతులు, గోల్డ్ , సిల్వర్ మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ జితేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి, జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. రెండు రోజులు జరిగిన ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి నిట్ వరంగల్ ప్రొఫెసర్ కోలాఆనంద్ కిషోర్, జిల్లా ఖజానశాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్‌కుమార్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్, క్రీడలను, క్రీడల ప్రాముఖ్యత గురించి ఉద్దేశించి వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ స్పోర్ట్స్ కమిటీ, ఎన్ఎస్ఎస్‌పిఓ శ్రీదేవి, నేషనల్ యూత్ అవార్డ్ గ్రహీత జక్కీ శ్రీకాంత్ , నెహ్రూయువ కేంద్ర వాలంటీర్ నక్క భరత్ కుమార్, గోల్కొండ మహేందర్ తదితరులు క్రీడాకారులు పాల్గొన్నారు.



రామాలయ అభివృద్ధికి విరాళం



నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి వారికి, శ్రీ ఆంజనేయ స్వామికి గణపురం లోని శ్రీ సాన్విత కంటి హాస్పిటల్ నిర్వాహకులు ముత్యం స్వర్ణలత భాస్కర్ దంపతులు 10116 రూపాయలు ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్‌కు మంగళవారం అందించారు. అనంతరం భాస్కర్ స్వర్ణలత దంపతులకు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ దంపతులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బటిక స్వామి, దెయ్యాల భద్రయ్య మూల శ్రీనివాస్ గౌడ్, పాండవుల భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి మహోత్సవం.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర



నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం చెల్పూర్ గ్రామ పరిధిలోని మాధవరావు పల్లి కాలనీలో ఏర్పాటు చేసిన బొడ్రాయి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ప్రజలందరూ కలిసి బంధు మిత్ర పరివారంతో ఘనంగా నిర్వహిస్తున్న బొడ్రాయి మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వారి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని నర్సింహారావు, సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచందర్ రెడ్డి, చెల్పూర్ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, రాజు గ్రామస్థులు పాల్గొన్నారు.

గుడి సొమ్ము రికవరీ అయ్యేనా ?

- మాజీ ప్రజాప్రతినిధుల మాయాజాలం
- పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదుతో వెలుగులోకి



నవతెలంగాణ-కాళేశ్వరం

దేవుడి పేరు చెప్పి గుడి సొమ్మును గుటకాయ స్వాహా చేశారు. గ్రామస్థులను నమ్మించి ఆ సొమ్మును తమ సొంతానికి వాడుకున్నారు. గుడి ఇంకెప్పుడు కడుతారని గ్రామస్థులు అడిగితే... ఆ డబ్బులు గుడి కోసం కాదనీ, ఇసుక క్వారీ కాంట్రాక్టర్ తమకు గిఫ్ట్‌గా ఇచ్చారని మాట మార్చి గ్రామస్థులను మోసం చేసిన మాజీ ప్రజాప్రతినిధుల మాయాజాలం జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్థుడి ఫిర్యాదుతో పోలీసులైతే కేసు నమోదు చేశారు. కానీ, మింగిన ఆ గుడి సొమ్మును ఎలా రికవరీ చేస్తారనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకెళ్తే...

మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధి పూసుకుపల్లి గ్రామానికి సమీపంలో ఇసుక క్వారీ రావడంతో నిత్యం దుమ్ము ధూళితో గ్రామస్థులు అనారోగ్యాల బారిన పడుతున్నామని, ఇసుక క్వారీ కాంట్రాక్టర్ మేడిపల్లి రంగారావును గ్రామస్థులు ప్రశ్నించారు. ఇసుక క్వారీ నడవడానికి అడ్డు చెప్పకుండా ఉండేందుకు సదరు కాంట్రాక్టర్ 2018 అక్టోబర్ 15న గ్రామ సంక్షేమం కోసం రూ.4 లక్షలు విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారు. అప్పటి సర్పంచ్ భర్త వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఆరుట్ల పవన్ సమక్షంలో కాంట్రాక్టర్ ఆ డబ్బులు అప్పజెప్పారు. ఆ డబ్బులు తీసుకున్న సదరు మాజీ ప్రజాప్రతినిధులు వాటితో గ్రామంలో ఒక గుడి కడుదామని తీర్మానించారు. ఇందుకు గ్రామస్థులు కూడా దైవ కార్యం కదాని నమ్మారు. ఇంకేముంది సదరు మాజీ ప్రజాప్రతినిధుల చేతుల్లో అంత డబ్బు పడ్డాక ఆశ పుట్టింది. ఆ డబ్బులను వారి సొంతానికి వాడుకుంటే ఎవరు అడుగుతారని భావించి సొమ్మును మింగేశారు. కాలం గడుస్తున్న కొద్ది గ్రామంలో గుడి పనులు ఏవీ కానరాకపోవడంతో అనుమానం వచ్చి గ్రామస్థులు నిలదీశారు. దీంతో డబ్బులు గ్రామంకు ఇవ్వలేదనీ, తమకు గిఫ్ట్ ఇచ్చారని చెప్పడంతో గ్రామస్థులు అవాక్కయ్యారు. దీనితో గ్రామానికి చెందిన బొల్లం సురేష్ అనే వ్యక్తి కాళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తమాషారెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామానికి ఇసుక కాంట్రాక్టర్ ఇచ్చిన ఆ రూ.4లక్షల సొమ్ము ఇప్పుడు ఎలా రికవరీ చేస్తారనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఫేక్ సర్టిఫికెట్‌తో పదవులు...!

ఇది ఇలా ఉండగా నిందితుల్లో ఒకరైన మాజీ సర్పంచ్ భర్త విన్నపరెడ్డి మోహన్ రెడ్డి గతంలో ఫేక్ సర్టిఫికెట్‌తో బీసీ కోటాలో ఎంపీటీసీగా పోటీ చేసి ఐదేళ్ల ఎంపీపీగా పదవి అనుభవించినట్లు ఇటీవల గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఓసి వర్గానికి చెందిన మోహన్ రెడ్డి బీసీగా కులం సర్టిఫికెట్ పొంది ఎన్నికల సంఘంను కూడా పక్కదోవ పట్టించి ఐదేళ్ల ఎంపీపీగా రాజ భోగాలు అనుభవించిన ఉదాంతం కూడా మండలంలో చర్చనీయాంశంగా మారింది. అప్పుడు ఫేక్ సర్టిఫికేట్ ఇచ్చిన అధికారిపై కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరిపితే ఇంకా ఆసక్తికరమైన వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవతెలంగాణ - ములుగు

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ అంబేద్కర్ సచివాలయంలో వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలు, యాసంగిలో సాగు నీరు, రైతు భరోసా, సంక్షేమ వసతి గృహాల తనిఖీ ప్రజాపాలన కుటుంబ సర్వే దరకాస్తులు ఆన్లైన్ తదితర అంశాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిపి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయాశాఖల అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీలు అరికట్టాలని ఆదేశించారు. ఆర్డీఓ వెంకటేష్, ఈఈ పిఆర్, డిసిఎస్ఓ, డిఏఓ, డిఈ ఎలక్ట్రిసిటీ, తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికలు రూపొందించాలి

నవతెలంగాణ-భూపాలపల్లి

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శాంతి కుమారి మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 53 సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధి కారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంచి నీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీలు అరికట్టాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రం 3.30 గంటలకు ఐడిఓసిలో ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యుత్‌శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని, సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అదనపు కలెక్టర్ల అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూ ర్ నాయక్, ఆర్‌డబ్ల్యూ ఎస్‌ఈ ఈ నిర్మల, ఇరిగేషన్ ఈఈలు తిరుపతి, యాద గిరి, ఆర్డిఓ రవి తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి



నవతెలంగాణ-గోవిందరావుపేట

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొవాలని క్వాలిటీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చల్వాయి ఉన్నత పాఠశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా హిందీ పాఠశాల సముదాయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యా బోధన ప్రక్రియలో భాగంగా ఆధునిక సాంకేతికతను విరివిగా ఉపయోగించి విద్యార్థులను సమకాలీన ప్రపంచంలో పోటీకి దీటుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం సాంకేతికతకు పెద్దపీట వేస్తోందని ఉపాధ్యాయులంతా ఇట్టి విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కొని దృశ్య శ్రవణం మాధ్యమాల సహాయంతో పిల్లలకు ఎప్పటికప్పుడు నూతన విజ్ఞానం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట మండల విద్యాశాఖ అధికారి దివాకర్‌తో పాటు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్యాంసుందర్ రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ గ్రూప్ సభ్యులు షేక్ హాజీ నూరానీ, జిల్లా రిసోర్స్ పర్సన్ పాద్య రవి మండల రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవతెలంగాణ-రేగొండ

స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చేది తెలవదని సిద్ధంగా ఉండాలని దిశ నిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ కోసం యుద్ధ సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. నాతో పాటు 20 ఏళ్లుగా కష్టపడ్డ కార్యకర్తలకు లాభం చేకూర్చేలా కృషి చేస్తానని అన్నారు. పాత, కొత్త కార్యకర్తలు కాకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. పార్టీలో ఉంటూ ప్రతిపక్ష నాయకులకు కొమ్ము కాస్తూ, అర్ధరాత్రులు ఫోన్ చేస్తున్న కార్యకర్తలను గుర్తిస్తామని తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. బీసీ డిక్లరేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో మొదటగా ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కుతుందని అన్నారు. అబద్ధాలు కేసీఆర్ కుటుంబంలోనే పుట్టాయని ఆరోపించారు. పది సంవత్సరాలు పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు అనేక అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తాను గెలిచిన నాటి నుండి నియోజకవర్గంలో అనేక నిధులు తీసుకు వచ్చి, రహదారులను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్‌గౌడ్, ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, కొడవటంచ ఆలయ చైర్మన్ ముల్కనూర్ బిక్షపతి, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు బూర్గుల ప్రమాదాదేవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సరస్వతి, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, బుగులోని జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, నాయకులు పున్నం రవి, పొన్నగంటి బ్రహ్మం, మేకల బిక్షపతి, మైస బిక్షపతి, పటెం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో నేడు తిరుగువారం పండుగ



నవతెలంగాణ -తాడ్వాయి

తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జా తర అత్యంత ఘనంగా ఈ సంవత్సరం నిర్వహించిన విషయం తెలిసిందే. మే డారం మినీ జాతర ముగిసిన తర్వాత నేడు బుధవారం జాతరలో భాగంగా సమ్మక్క సారలమ్మ పూజారులు తిరుగువారం పండుగ ఘనంగా నిర్వహించ నున్నారు. ఆదివాసీ పూజారులు తమ గిరిజన సాంప్రదాయాల ప్రకారం సమ్మక్క సారలమ్మ గద్దెలను శుద్ధిచేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నేడు సమ్మక్క సారలమ్మ గద్దెల చుట్టూ ఏర్పాటుచేసిన రక్షణ గ్రిల్స్‌కు తాళం వేస్తారు. ఇక నేడు తిరుగువారం పండుగ కాబట్టి మేడారంలో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది.

నిరంతరం పర్యవేక్షణ చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహ సంక్షేమ గృహాలు, అంగన్‌వాడీ కేం ద్రాలలో అల్పాహారం, భోజన సౌకర్యాలు అమలును మరింత మెరుగు పర్చేం దుకుమండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు .మంగళవారం మండల ప్రత్యేక అధికా రులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో చి న్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, సంక్షేమ వసతి గృహాల్లో అల్పాహారం, భోజన సౌకర్యాలు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయు అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేటాయించిన మండలాల్లో భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఆహార పదార్థాల శుభ్రత, పోషక విలువలు, వంటగదుల నిర్వహణ, భోజన పరిమాణం, మెనూ అమలు తదితర అంశాలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులను పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, అందుతున్న సౌకర్యాలను సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న మెను, సౌకర్యాల తనిఖీ చేయాలని అన్నారు. తగినన్ని వసతులు కల్పించబడుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. టీచింగ్ సిబ్బంది సమయ పాలనను పరిశీలించి, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు.. పిచికారీతో పొలం ధ్వంసం

- శ్రీసాయి పెర్టిలైజర్ దుకాణం ముందు
- బాధిత రైతు ఆందోళన



నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును ఓ రైతు పిచికారీ చేయడంతో రేండు ఎకరాల పొలం చనిపోయిన సంఘటన మండల కేంద్రమైన తాడిచెర్ల ఆల స్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల పూర్తి కథనం ప్రకా రం తాడిచెర్ల గ్రామానికి చెందిన శ్రీసాయి పెర్టిలైజర్ అండ్ పెస్టి సీడ్స్ దుకాణ యజమాని ఇదే గ్రామానికి చెందిన మేనం మొగిలి అనే రైతుకు ఇటీవల ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయించాడు. రైతు తనకున్న రెండు ఎకరాల పొలంలో కలుపు మొక్కలు పోవడానికి రేండు వారాల క్రితం పిచికారీ చేశాడు. తెల్లవారి నుంచి పొలం అంతా ఎండిపోయి చనిపోతుం డగా వెంటనే బాధిత రైతు లబోదిబోమంటూ పెర్టిలైజర్ యజమాని వద్దకు పరుగులు తీశాడు. మొదట ఎరువుల వ్యాపారి నాకు సంబంధం లేదని బుకాయించే ప్రయత్నం చేశాడు. గ్రామస్తుల సహకారంతో రైతు గట్టిగా నిలదీయగా గడ్డిమందు ఇచ్చింది వాస్తవమేని ఒప్పుకొని రైతుతో సెటిల్‌మెంట్ బేరం చేసుకున్నాడు. వ్యాపారి రైతుకు ఒప్పుకున్న డబ్బులు ఇవ్వడంలో మళ్ళీ బుకాయించే ప్రయత్నం చేశాడు. దీంతో బాధిత రైతు కుటుంబంతో కలిసి మంగళవారం పెర్టిలైజర్ దుకాణం ముందు బైఠాయించి, ఆందోళన చేపట్టాడు. దీంతో ఎరువుల వ్యాపారి తోకముడిచినట్లు సమాచారం. ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరే ప్రయత్నం చేయగా ఆమె అందుబాటులోకి రాకపోవడంతో గమనార్హం. ఈ ఎరువుల దుకాణంపై జిల్లా వ్యవసాయ అధికారులు విచారణ చేపడితే మరిన్ని ప్రభుత్వ నిషేధిత మందులు బయట పడే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
- భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే





నవతెలంగాణ-భూపాలపల్లి

నేరాల నియంత్రణ కోసం పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టి, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నేర సమీక్ష స మావేశం నిర్వహించి, పోలీస్ స్టేషన్ ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో విచారణ, స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేపట్టే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకో వాలన్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, మహిళల పట్ల నేరాలపై వేగంగా స్పందించి, న్యాయం చేయాలన్నారు. వివిధ దొంగతనాల కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ప్రమాదాలు జరిగిన చోటును హాట్ స్పాట్‌గా గుర్తించి, వాటికి గల కారణాలను తెలుసుకుని, ఇతర శాఖల సమన్వయంతో సమస్య పరిష్కార దిశగా చర్య లు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అద నపు ఎస్పి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డీఎస్పి సంపత్ రావు వర్టికల్ డీఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధి సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సన్నద్ధం కావాలి

- డీఈఓ రాజేందర్



నవతెలంగాణ-చిట్యాల

10వ తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమందారం రాజేందర్ అన్నారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులందరూ అత్యుత్తమ మార్కులతో పాస్ కావాలని ఉత్సాహాన్ని నింపారు. సెక్టోరియల్ ఆఫీసర్ రాజగోపాల్ మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో చిట్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పాస్ కావాలని అన్నారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కూచన పల్లి శ్రీనివాస్, బొమ్మ రాజమౌళి, నీలిమ రెడ్డి, సుజాత విజయలక్ష్మి, కల్పన, ఉస్మానాలి, మౌనిక, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూధం సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

10 జీపీఏ లక్ష్యంగా చదవాలి : డీఈఓ

మొగుళ్ళపల్లి : మార్చి నెలలో జరుగనున్న పదవ తరగతి పరీక్షలలో 10 జీపీఏ సాధనే లక్ష్యంగా ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదవాలని డీఈఓ ముద్దమల్ల రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, మొట్లపల్లి, పిడిసిల్ల, ముల్కలపల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల ప్రగతి రికార్డులను, ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పరీక్ష హాలులో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక తరగతుల సమయంలో అందిస్తున్న అల్పాహారం మెనూ, మధ్యాహ్న భోజనం మెనూపై అడిగి తెలుసుకున్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ దుప్పటి రాజగోపాల్, పాఠశాలల ప్ర ధానోపాధ్యాయులు పింగిలి విజయపాల్‌రెడ్డి, నరసింహస్వా మి, శ్రీనివాస్, మహేష్, కోటేశ్వర్, శ్రీమంజరి, వెంకన్న, అని ల్‌కుమార్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విద్యుత్ వినియోగంపై అవగాహన



నవతెలంగాణ - ములుగు

విద్యుత్తు పొలం బాటలో భాగంగా మంగళవారం జగ్గన్నపేట గ్రామశివారు రైతులతో విద్యుత్తు అధికారులు భూపాలపల్లి సర్కిల్ డీఈఈ టెక్ వెంకటేశం, ములుగు డీఈఈ పులుసం నాగేశ్వర్‌రావు హాజరై కెపాసిటర్ బిగించడం వల్ల కలిగే లాభాలు, ఎలక్ట్రికల్ పరికరాలకు ఎర్తింగ్ పద్ధతులను అందించడం వల్ల రక్షణ పొందడం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఇంటిలోని విద్యుత్తు పరికరాలను తడి చేతులతోని ముట్టుకోకుండా సూచనలు, ఛార్జింగ్ పెడుతూ ఫోన్ మాట్లాడడం వల్ల కలిగే ప్రమాదాలు, వ్యవసాయ బోరు వద్ద ఆటోస్టార్టర్ల వలన కలిగే దుష్ప్రభావాలు, విద్యుత్తు సర్విస్ వైరు నాణ్యతా ప్రామాణికత, సక్రమంగా గృహ జ్యోతి వినియోగం, అనాధికార గృహ, వ్యవసాయ కనెక్షన్లు క్రమబద్ధీకరించడం పట్ల వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈ బానోత్ రవి, ఏఎల్ఎం కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

సాంకేతిక విజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవాలని పీఎం ఎస్ఆర్ఎఐ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ లక్ష్మణ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు 130 మంది కలిసి హనుమకొండలోని ఎన్ఐటీ యూనివర్సిటీని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య, శాస్త్రీయ విద్య పెంపొందించేందుకు స్టెమ్ సంస్థ ద్వారా స్టడీ టూర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్ సైన్సు విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. భవిష్యత్లో క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత స్థాయికి చేరేందుకు ఈ టూర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, రాజు, రజిని, రజిత పాల్గొన్నారు.

ఘనంగా సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



నవతెలంగాణ - ములుగు

పత్తిపల్లి గ్రామంలో సేవాలాల్ గోరుమాటి మళావ్ ఆధ్వర్యంలో మంగళవారం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహాభోగ్ భండారో, మహా అన్నదానం నిర్వహించారు. పూజారి బాల బ్రహ్మచారి కిషన్ మహారాజ్, మహాభోగ్ నిర్వహించి సేవాలాల్ మహారాజ్ విశిష్టతను గోర్ జాతికి చేసిన సేవలను వివరించారు. మహారాజ్ మార్గాన్ని అనుసరిస్తూ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాలని చెప్పారు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని గ్రామంలో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. సేవాలాల్ మహారాజ్ గుడిని నిర్మిండానికి మంత్రి సీతక్కతో మాట్లాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో గోర్ సిక్వాడి సేనలు పోరికా రాజ్‌కుమార్, రాహుల్, హరిలాల్, బాబు రవివర్మ గ్రామ పెద్దలు పోరిక నందానాయక్, పోరిక భీమ నాయక్, హట్కర్ హేమ్లాల్, ధరవత్ సారయ్య, ప్రతాప్ సింగ్ ఇస్లావత్ బద్రు , పోరిక భద్రు మూడ్ పుష్ప, యువకులు పోరిక రాజ్ కుమార్, రవీందర్, ప్రవీణ్ కుమార్, రాజేందర్, రాజేష్, రాకేష్, జితేందర్, బాబురాం, అఖిల్, శివ, డిజె సురేష్, రాజేందర్, నరేష్ రాజు, రవి, బబ్లూ, ఝురా, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

అంగన్‌వాడీ టీచర్ దురుసు ప్రవర్తన

- విచారణ చేపట్టిన సీడీపీవో



నవతెలంగాణ - ములుగు

బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సిన అంగన్‌వాడీ టీచర్ కేంద్రానికి వచ్చే పిల్లల తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని బాధిత తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపిన తల్లి మధ్యాహ్నం క్షేమసమాచారాలు అడిగేందుకు ఫోన్ చేస్తే ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆరోపించారు. ఈ విషయంపై సీడీపీవో, డీడబ్ల్యూవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ములుగులోని గడిగడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని సుభాష్‌నగర్‌లో నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో నివాసముంటున్న కె కావ్య తన మూడేళ్ల చిన్నారిని సోమవారం అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో తన కూతురి క్షేమసమాచారం తెలుసుకునేందుకు అంగన్‌వాడీ టీచర్‌కు ఫోన్ చేశారు. ఇంత చిన్న అమ్మాయిని పంపిస్తారా ? ఈ అమ్మాయి స్కూల్‌లో ఉంటదా..? అంటూ దురుసుగా మాట్లాడింది. ఈ విషయాన్ని చిన్నారి తల్లి తన అత్తమ్మకు తెలిపి ఇరువురు కలిసి మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లారు. సెంటర్‌కు తమ బిడ్డను పంపాలా వద్దా అని అడగగా మళ్లీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తన భర్త అరవింద్‌కు తెలియజేయడంతో వెంటనే సీడీపీవోతోపాటు జిల్లా సంక్షేమ అధికారిణికి ఫిర్యాదు చేశారు. సీడీపీవో శిరీష స్పందించి సూపర్‌వైజర్ కావ్యను సుభాష్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి విచారణ జరిపించారు. తప్పు ఒప్పుకున్న టీచర్ చిన్నారి తల్లికి క్షమాపణ చెప్పారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావొద్దని సూపర్‌వైజర్ టీచర్‌ను హెచ్చరించారు. కాగా, తన మూడేళ్ల బిడ్డను అంగన్? వాడీ కేంద్రానికి పంపితే సక్రమంగా చూసుకోలేదని, తమపై దురుసుగా ప్రవర్తించిందని, సదరు టీచర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

నవతెలంగాణ
4
జనగామ
బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని వామపక్షాల ధర్నా



నవతెలంగాణ-డెస్క్

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను సవరించి, నిత్యవసర వస్తువు ధరలు తగ్గించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్నలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను ప్రజా బడ్జెట్‌గామార్చి ప్రజల్ని ఆదుకోవాలని వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపుమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్కు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసనధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్నలు మాట్లాడుతూ ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలపై భారాలు వేసి కార్పోరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెట్టే విధంగా బడ్జెట్ ఉందని అన్నారు. ఇది ప్రజా బడ్జెట్ గా లేదన్నారు.కరోనాతో ప్రజల జీవన ఆర్థిక పరిస్థితి తగ్గిపోయిందన్నారు. ఇలాంటి క్రమంలో ధరలు తగ్గించి భారాలు తగ్గించి, ఉపాధి అవకాశాలు పెంచి, విద్యా వైద్యం ఫ్రీగా అందించి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రజల కుబాధలు పెంచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం ఉచితంగా అందించే విధంగా బడ్జెట్లో నిధులు లేవన్నారు. చదువుకున్న నిరుద్యోగయువతకు ఉపాధి అవకాశాలకు నిధులు కేటాయించలేదన్నారు.

కార్మిక వర్గాన్ని గాలికి వదిలేసిందన్నారు. ఎల్ఐసి రక్షణ రంగంలో ఎఫ్‌డిఐని 100శాతం అనుమతిస్తూ నిర్ణయం చేయడం సరైనది కాదన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా ఈ బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయి అని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఊసే లేదు అన్నారు. దళితులు, ఆదివాసులు, గిరిజనులు, మహిళల అభివద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. నూతనంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి విభజన చట్టంలోని హామీలు అమలు చేయడానికి నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా బడ్జెట్ ను సవరించి ప్రజల్ని ఆదుకునే విధంగా ప్రతిపాదించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం), సిపిఐ నాయకులు ఈ అహల్య, సాంబరాజు యాదగిరి, బొట్ల శేఖర్, బూడిద గోపి, సుంచు విజేందర్, పి.ఐలయ్య, గుర్రం మధు, బెజగం చంద్రయ్య, జయకృష్ణ, బి.వెంకటరెడ్డి, బి.వెంకటమల్లయ్య, మీట్యానాయక్, డి.సుమ,ఆర్య కనకచారి, పి.సుగుణ, ఎం.బీరయ్య, టి.ఆనందం, మహేందర్, సుధాకర్, సౌందర్య, ఉపేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కళలను కాపాడుకోవాలి

- ఇండస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ సుధాకర్



నవతెలంగాణ-పాలకుర్తి

గ్రామీణ కళలను కాపాడుకునేందుకు కళాకారులు కళా ప్రదర్శనలు నిర్వహించాలని ఇండస్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలో గల సుధా టెక్నో స్కూల్ ఆవరణలో రాష్ట్ర భాష సాస్కృతిక శాఖ సహకారంతో మంగళవారం చిందు యక్షగాన నాటకోత్సవాలు కన్నుల పండుగగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఆరూరి సుధాకర్ మాట్లాడుతూ చిందు యక్షగానంలో పౌరాణిక కథలతో పాటు సామాజిక అంశాలపై కళా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పౌరాణిక పాత్రల్లో కళాకారుల ప్రదర్శనలు అభినందనీయమన్నారు. చిదు కళాకారులు యక్షగాన కళారూపాలను ప్రదర్శిస్తూ యక్షగానకళలకు చిందు కళాకారులు జీవం పోస్తున్నారని కొనియాడారు. యక్షగాన కళారూపాలు ఎంతోమందికి జీవనోపాధిని అందించడంతోపాటు ప్రజలకు విజ్ఞాన వినోదాలను అందిస్తున్నాయని తెలిపారు.

గ్రామీణ ప్రాంత కళ లను ప్రదర్శించి గ్రామీణ కళలను కాపాడుకోవడంతో పాటు కళలకు జీవం పోస్తు న్న పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య, గడ్డం శ్రీనివాస్, గడ్డం సంజీవ గడ్డం రఘుపతి గడ్డం సోమరాజు బందాలను అభినందించారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాపాక విజయ్ తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పట్టింపులేని సీఎం

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్



నవతెలంగాణ-పరకాల

తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్వి డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పరకాల మండల మహాసభ నిర్వహించడం జరిగింది.సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య రంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగావిఫలమైందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాడి సంవత్సరం నరవుతున్న కూడా ఇప్పటివరకు విద్యారంగ సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7వేల 200 ల కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్లో ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనలు లేక విద్యార్థులు అద్దెభవనల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయలేక సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలను పట్టించుకొని పరిష్కరించాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా శ్రీకాంత్ హెచ్చరించారు.

సీఎం, డిప్యూటీ సీఎంలను కలిసిన మార్నేని

నవతెలంగాణ-నక్కలగుట్ట

డీసీసీబీ, సహకార సంఘాల పదవీ కాలాన్ని 6 నెలలు పొడిగించిన సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి జానారెడ్డిలను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు డిసిసిబి చైర్మన్లతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో డిసిసిబి చైర్మన్లు సత్తయ్య,రమేష్ రెడ్డి,దేవేందర్ రెడ్డి,విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బోజారెడ్డి, వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలను అసౌకర్యాలకు నిలయంగా ఉండవద్దు

జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



నవతెలంగాణ-జఫర్‌గడ్

గురుకుల పాఠశాలలు అసౌకర్యాలకు నిలయంగా ఉండవద్దని ప్రతీ గురుకులం, హాస్టల్, పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను మంగళవారం జనగామ జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా మూత్రశాలను పరిశీలిస్తూ మూత్రశాలను మరమ్మతులను మంజూరు చేయాలని సంబంధిత ఏఈకి సూచించారు. తరగతి గదిలో బందం కోడింగ్ తరగతి గదిని సందర్శించి, విద్యార్థులతో సంభాషించి, వారి ప్రతిభ, ఉత్సాహాన్ని అభినందించారు. డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసి పరిశుభ్రత, ప్రమాణాల పట్ల బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వెంటిలేషన్ మెరుగుపరచడానికి ఫ్యాన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయంలో డిప్యూటేషన్ల లొల్లి...!

- శ్రీధర్ ఏ ప్రోగ్రాంకు సహాయ అధికారి...?
- ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు
- అంతా సక్రమంగానే : డీఈవో రమేష్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

విద్యాశాఖ జిల్లా కార్యాలయంలో చాలాకాలంగా డిప్యూటేషన్ల వివాదం కొనసాగుతోంది. బదిలీపై వెళ్లిన డీఈవో రాము ఉన్నప్పటినుండి ఈ వివాదం రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. డీఈఓ కార్యాలయంలో డిప్యూటేషన్ల పై పనిచేస్తున్న మిగతా ఉద్యోగుల విషయంలో అధికారుల వద్ద కొంత క్లారిటీ ఉన్నప్పటికీ మరి కొంతమంది డిప్యూటేషన్ సిబ్బంది విషయంలో స్పష్టత కొరవడినట్లు కనిపిస్తుంది. చాలా కాలంగా డిప్యూటేషన్ పై కొనసాగుతున్న ఓ ఉద్యోగి ఏపీఎం హోదాలో పని చేస్తున్నాడని చెబుతున్న అధికారులు అందుకు తగిన ఆధారాలను చూపించలేక పోతున్నారు. ఏపీఎంగా చెలామణి అవుతున్న ఆ ఉద్యోగి కనుసన్నల్లోనే డిఈఓ కార్యాలయం ముందుకు సాగుతోందని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఏ ప్రోగ్రాంకు సహాయ అధికారి అనే విషయంలో అధికారుల వద్ద సమాధానం లేకపోవడం గమనార్హం. ఈ విషయంలో రెండురోజుల క్రితం డీటీఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కు ఆందోళన నోటీసులు అందజేశారు.

సమగ్ర శిక్ష కోసం ...

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వ శిక్ష కోసం జిల్లాలో 5 గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. వీరంతా ఇందుకోసం ప్రత్యేకంగా నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. శ్రీనివాస్ రావు, గౌసియా బేగం, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, సీఎంవో నరసింహారావు సర్వ శిక్ష అమలు కోసం డీఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి డిప్యూటేషన్ కు సంబంధించిన నియామక పత్రాలున్నాయి. వీరందరికీ ఫారిన్ సర్వీస్ కింద వేతనాలు చెల్లిస్తున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 5 ఏళ్లుగా డిప్యూటేషన్ పై పనిచేస్తున్న ఏపిఎంగా చెప్పుకుంటున్న శ్రీధర్ అనే ఉపాధ్యాయుని విషయంలోనే వివాదం రేకెత్తుతోంది. ఏపిఎం అంటే అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్‌అని విషదీకరిస్తున్నజిల్లా అధికారులు ఏ ప్రోగ్రాంకు సహాయాధి కారి అనే విషయాన్ని తేటతెల్లం చేయలేకపోతున్నారు. డిప్యూటేషన్‌కు సంబం ధించిన నియామక పత్రాన్నిబయట పెట్టడంలో జిల్లా అధికారులతో పాటు సదరు ఉద్యోగి కూడా సంశయాన్ని వ్యక్తపరచడం విశేషం. 2023-2024 విద్యా సంవ త్సరంలో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అందజేసే ఏకరూప వస్తు వుల పంపిణీలో డీఈవో కార్యాలయం కేంద్రంగా తతంగం నడిచిన విషయం తెలి సిందే. ఈ అంశం అధికారుల విచారణలో బట్టబయలై బాధ్యులపై చర్యలు తీసు కునే అంశం విద్యాశాఖ డైరెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉంది. సదరుఉద్యోగి విధి నిర్వ హణలో నిష్ణాతుడే అయినప్పటికీ చాలాకాలంగా డిప్యూటేషన్ పై డీఈఓ కార్యాల యంలో తిష్ట వేయడం పట్ల ఉపాధ్యాయ యూనియన్లు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేయ డంలో పాటు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి.

డిప్యూటేషన్ అన్ని రకాలుగా సక్రమమైనదే : డిఈఓ రమేష్



దాదాపు 5 సంవత్సరాలకు పైగా విద్యాశాఖ జిల్లా కార్యాలయంలో శ్రీధర్ ఏపీవో విధులు నిర్వహిస్తున్నారు. అతని డిప్యూటేషన్ అన్ని రకాలుగా సక్రమమైనదే. ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీధర్‌పై వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారు. శ్రీధర్‌కు వేతనాలను అతని ఒరిజినల్ పాఠశాల నుండి కాకుండా ప్రత్యేకమైన పద్ధతిలో చెల్లిస్తున్నాం. పని సర్దుబాటు చేసుకోవడంలో తప్పులేదు.

అందరికీ అన్నీ తెలుసు : శ్రీధర్, డిప్యూటేషన్ ఉద్యోగి

నా డిప్యూటేషన్ విషయంలో ఎలాంటి అనుమానాలకు తావు లేదు. అందరికీ అన్నీ తెలుసు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మాత్రం వారు చెప్పినట్లు నేను వినడం లేదననే అక్కసుతో వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారు. నా డిప్యూటేషన్ పట్ల ఏమైనా అనుమానాలు ఉంటే జిల్లా పాలనాధికారి అయిన కలెక్టర్ కు ఫిర్యాదు చేసుకోవచ్చు. అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించడమే నా విధి.

లింగనిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం : కలెక్టర్ రిజ్వాన్‌బాషా

- భ్రూణ హత్యలకు పాల్పడితే కఠిన చర్యలు
- పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం- 1994పై సదస్సు



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మంగళవారం మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ (మహిళా శక్తి - సామర్థ్య మహిళా సాధికారత కేంద్రం, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో పదేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా డీసీపీ రాజమహేంద్ర నాయక్ తో కలిసి కలెక్టర్ పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్-1994పై ఐసీడీఎస్ సూపర్వైజర్ లు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలకు ఓరియెంటేషన్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ - 1994ను సరిగ్గా అమలు చేయాలన్నారు. పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ ప్రకారం భ్రూణ హత్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ చర్యల పట్ల ప్రోత్సహించిన వారికి, సహకరించిన వారికి (5) ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. గ్రామ, మండలస్థాయిలో ప్రజలకు లింగ నిష్పత్తిపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఆసుపత్రిలో, స్కానింగ్ సెంటర్లలో ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి ఈ చట్టంపై ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా పీవోలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు ప్రతిఆసుపత్రిని, జిల్లాలో గల మొత్తం 21 స్కానింగ్ సెంటర్లను సందర్శించి, పరిశీలించాలని ఆదేశించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరమైన (ఐపీసీ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు పీసీ అండ్ పీఎన్డీటీయాక్ట్-1994పై అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

అనంతరం జిల్లాలో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు, భ్రూణహత్యలు చేసే వారి గురించి ఫిర్యాదు చేయడానికి మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ కోరారు. అదే విధంగా సమాచారాన్ని సీల్డ్ కవర్ ద్వారా పోలీసు అధికారులకు, తమకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుడి పేరును బయటకు రానివ్వమని, ఎలాంటి భయాలకు గురికావొద్దని, ఈ విషయమై సమాచారం ఇచ్చిన వారికి రూ. 10 వేల నజరానా ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీదేవి, మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ హెచ్. శారద, ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్ గౌడ్, సీడీపీఓలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు కట్టుదిట్టంగా అమలు చేయాలి



- వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్
- రైతు భరోసాపై గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి చివరి ఆయకట్టుకు సాగునీరు
- వేసవిలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సిఎస్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం ఆమె ప్రభుత్వ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. తాగునీటి సరఫరా, రబీ పంటలకు సాగు నీరు, విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధృవీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై ముఖ్య కార్యదర్శి సుదీర్ఘంగా చర్చించి కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు. విద్యుత్ పై మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి నెలలో వచ్చిన అత్యధిక విద్యుత్ డిమాండ్ 15 వేల 623 మెగా వాట్లు కాగా ప్రస్తుతం ఫిబ్రవరి మాసంలోనే వస్తుందని అన్నారు. 17 వేల మెగా వాట్ల ఎక్కువ డిమాండ్ వచ్చిన సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు జరిగాయని సీఎస్ తెలిపారు. వ్యవసాయం, గహాలు, పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగాలని, అవసరమైన మేర విద్యుత్తు అందుబాటులో ఉన్నందున ఎక్కడ ఎటువంటి లోటు రావడానికి వీలు లేదని సిఎస్ పేర్కొన్నారు. సబ్ స్టేషన్ వారిగా అదనపు విద్యుత్ పంపిణీ తట్టుకునేలా నూతన విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ ల ఏర్పాటు పనులను ఫిబ్రవరి నెల వరకు పూర్తవుతున్నాయని సీఎస్ పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా అంశంలో స్థానికంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని, డిమాండ్ మేరకు విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు ఉంటే వెంటనే తమ దష్టికి తీసుకుని రావాలని సి.ఎస్ కలెక్టర్లకు సూచించారు. ఫీడర్ల వద్ద సమస్యతో గత సంవత్సరం కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ సంవత్సరం ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలని అన్నారు. మిషన్ భగీరథ, పట్టణాలలో అమత్ క్రింద చేపట్టిన త్రాగు నీటి స్కీం, ఇతర త్రాగు నీటి స్కీంలకు, ఆసుపత్రులకు, వ్యవసాయ ఫీడర్లకు నిరంతరాయ సరఫరా ఉండే విధంగా ప్రత్యేకంగా పరిరక్షించాలని అన్నారు.

జిల్లా కలెక్టర్లు తమ పరిధిలోని సబ్ స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేస్తూ, అక్కడ పరిస్థితులను పరిశీలిస్తూ ఉండాలని సిఎస్ అన్నారు. రైతు భరోసా విషయంలో వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటి వరకు 3 ఎకరాల వరకు రైతులకు ఎకరానికి 12 వేల రూపాయలు చొప్పున పెట్టుబడే సహాయం అందిందని, 63% పట్టాదారులు సహాయం పొందారని అన్నారు. ప్రజా పాలన గ్రామ సభలలో కొన్ని సర్వే నెంబర్ లలో కొంత మేర సాగు భూమి వ్యవసాయేతర భూమి గా నమోదైందని తమ దృష్టికి తీసుకుని వచ్చారని, నేడు వాటిని సరి చేసే అవకాశం రైతు భరోసా పోర్టల్ లో అందించామని అన్నారు. రైతు భరోసా పోర్టర్ లో మిగిలిన వ్యవసాయ భూముల నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్లు 5 రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు.

రైతు భరోసాపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆ మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. యాసంగి పంటకు అవసరమైన ఎరువులు సంపూర్ణంగా అందుబాటులో ఉన్నాయని, జిల్లాల్లో ప్రతి మండలంలో అవసరమైన ఎరువుల స్టాక్ ఉండే విధంగా కలెక్టర్ పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలలో ఎక్కడైనా అవసరం ఉంటే వెంటనే సంప్రదించాలని, ఎక్కడైనా ప్యాక్ (పిఎసిఎస్) దగ్గర స్టాక్ లేకపోతే వెంటనే స్టాక్ అందించేలా చూడాలని అన్నారు. యాసంగి సాగు నీటి సరఫరా గురించి ఆన్, ఆఫ్ విధానంలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సాగు నీరు రైతులకు అందాలని, ప్రతి నీటి చుక్కను వినియోగించుకోవాలని అన్నారు.

ఈ వీసీ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్షించి, దిశానిర్దేశం చేశారు. తాగు, సాగు నీటి సరఫరాకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతిరోజూ తాగు, సాగు నీటి సరఫరా వివరాల నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీపీఓ రామారావు నాయక్, డీఎం సిఎస్ హాతిరాం, మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, మండలాల ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేట్‌ల ఏర్పాటు



నవతెలంగాణ-పాలకుర్తి

ప్రమాదాలను నివారించేందుకు భారీ కేట్స్ ఏర్పాటు చేశామని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలతో అప్రమత్తమైన పోలీసులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేంతవరకు మంగళవారం రాజీవ్ చౌరస్తాలో నాలుగు వైపులా బారికేట్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లు విశాలంగా ఉండటంతో వాహనదారులు అతి వేగంగా వాహనాలను నడుపుతున్నారని తెలిపారు. అతివేగంగా వెళ్లే వాహనాలను అదుపు చేయకపోవడంతో ప్రమాదాలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. ప్రజల రద్దీతోఉండే రాజీవ్‌చౌరస్తాలో ప్రమాదాలు జరగడం ప్రజలను ఆందోళనకు కలిగిస్తుందని తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో రాజీవ్ చౌరస్తాలో 4 వైపుల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసేంతవరకు పోలీసుల ఆధ్వర్యంలో భారీ కేట్లు నాలుగు వైపులా ఏర్పాటు చేశామని తెలిపారు.

వాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దూలం పవన్ కుమార్ తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో బస్టాండులో వ్యక్తి మృతి



నవతెలంగాణ-పాలకుర్తి

గుండెపోటుతో పాలకుర్తి బస్టాండ్‌లో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన ఎండి.ఖాజామీయా వావిలాల గ్రామంలో వెల్డింగ్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడని తెలిపారు. మృతుడికి భార్య పిల్లలు ఎవరూ లేరని, ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారన్నారు. ఛాతిలో మంట మండడంతోపాటు ఆయాసం వస్తుందని పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్నాడని తెలిపారు. బస్సుకోసం బస్టాండుకు వచ్చిన ఖాజామీయాకు ఆయాసంతో పాటు ఛాతిలో మంట ఎక్కువకావడంతో బస్టాండ్ లో ఉన్న గద్దెపై పడుకొని అక్కడికక్కడే మృతి చెందాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారన్నారు. ఖాజా మియా మృతి పట్ల ఎలాంటి అనుమానాలు లేవని వివరించారు.

మృతుడి సోదరుడు మహమ్మద్ ఫకీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-జఫర్‌గడ్

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నట్లు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి పల్లెరాజిరెడ్డి తెలిపారు. మం డలంలోని తమ్మడపల్లి (జి) ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పరీక్షల మెటీరియల్‌ను సంస్థ వారు అందించా రు. అనంతరం హెచ్ఎం సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రా జిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సమాజం గురించి ఆలోచించ గలుగుతున్నారంటే ఇక్కడ వారికి ఉపాధ్యాయులు అందించే విద్యయే ముఖ్య కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో తల్లి దండ్రుల బాధ్యత ప్రధానమైనదని వివరించారు. సమయాన్ని సద్విని యోగం చేసుకున్నవారే రాణించగలుగుతారని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సాంబరాజు, ఉపాధ్యాయులు ఆరోగ్యరెడ్డి,సంపత్ కుమార్, సురేష్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వివో తప్పిదాలకు వివోఏలవే బాధ్యత



నవతెలంగాణ-జఫర్‌గడ్

గ్రామస్య సంఘాల అవినీతికి పాల్పడితే వారిపై కట్టిన చర్యలు తీసుకుంటామని ఏపీఎం రవీందర్ అన్నారు. మండలంలోని కోనాయిచలం గ్రామంలో మంగళవారం స్త్రీనిధి రుణాలపై లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఆడిట్ తోనే వివో లోపాలను గుర్తించవచ్చు. వివో తప్పిదాలకు వివో ఏలు, ప్రతినిధులే బాధ్యులు అని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు, ప్రతి రూపాయికి సరియైన ఆధారాలు చూపిం చాలన్నారు. గ్రామైక్య సంఘాల్లో నెలసరి జరిగే లావాదేవీలలో పొరపాట్లు జరిగితే వివోఏల, వీవో ప్రతినిధులే బాధ్యత వహించాలని తెలిపారు. అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన సంతోషిమాత మహిళా సంఘం సభ్యులు ఏపీఎంకు వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ బ్యాంకు నుండి రూ.4 లక్షలు సంఘానికి మంజూరైతే సీఏ కేవలం మా సంఘానికి రూ.1లక్ష మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు సీఏ స్వాతికి ఇచ్చినట్లు బ్యాంకు అధికారులు తెలిపారని. కానీ ఆ డబ్బులు మహిళా సంఘ సభ్యులే చెల్లించాలన్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయకూర్చాలని గ్రామం మహిళా సంఘాలు సభ్యులు కోరారు. ఏపీఎం మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీఏ, గతంలో పనిచేసిన ఏపీఎంపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన శ్రీవారి

నవతెలంగాణ-డెస్క్



మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదిన సందర్భంగా ఆయన ఫామ్ హౌస్‌లో మంగళవారం మండల యూత్ అధ్య క్షుడు గట్టగల్ల శ్రీవారి మర్యాద పూర్వకంగా కలి సి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్యుమరేటర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

- నోడల్ ఆఫీసర్, ఎంపీడీవోలకు వినతి



నవతెలంగాణ-చిన్న గూడూరు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను నిర్వహించిన ఎన్యు మరేటర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని మంగళవారం చిన్నగూడూరు సర్వే నోడల్ ఆఫీసర్, ఎంపీడీవో రామారావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన గౌరవ వేతనం తక్షణమే ఇవ్వాలని వారు కోరారు. సర్వే విజయవంతం చేసినప్పటికీ మరో వేతనం ఇవ్వకపోవడం చాలా బాధాకర విషయమన్నారు. ఈ కార్యక్రమంలో లలిత, నాగార్జున, హరిచంద్, హరిత, అవంతిక, శ్రీలత, జ్యోతి, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ యాదగిరిరెడ్డికి సన్మానం



నవతెలంగాణ-మరిపెడ

తెలంగాణ రాష్ట్రంలో పీఏసీఎస్ చైర్మన్‌ల పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వం వారికే మళ్లీ ఆరు నెలలు కొనసాగే విధంగా పొడిగించి అవకాశం కల్పించడం అభినందనీయమని మరిపెడ మాజీ సర్పంచ్ పానుగోత్ రామ్‌లాల్ అన్నారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ చాపల యాదిగిరి రెడ్డిని ఆయన శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా రామ్ లాల్ మాట్లాడుతూ యాదగిరిరెడ్డి చైర్మన్ అయిన తర్వాత ప్రాథమిక సహకార పరపతి సంఘం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. యాదగిరిరెడ్డిని కొనసాగించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో అదే స్ఫూర్తితో రైతులకు మరింత సేవ చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి నరేష్, డైరెక్టర్ గూగులోత్ బాలకిషన్, రైతులు తదితరులు ఉన్నారు.



తునికాకు టెండర్ల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి

- అలువాల వీరయ్య, భూక్యా హరినాయక్‌ల డిమాండ్

నవతెలంగాణ-మహబూబాబాద్

తునికాకు టెండర్ల ప్రక్రియను తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి అలువాల వీరయ్య తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఎఫ్‌వో సూపరింటెండెంట్‌కు సంఘాల ప్రతినిధి బృందం అందజేశారు. అనంతరం వీరయ్య, హరి నాయక్‌లు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం, గార్ల, పెదగూడూరు, కొత్తగూడ, గంగారం ఏజెన్సీ ప్రాంతాలతో పాటు మహబూబాద్‌రూరల్, కేసముద్రం, నెల్లికుదురు మండలాలలో గిరిజనులు ఇతర సామాజిక తరగతులకు చెందిన నిరుపేదలు తునికాకు సేకరణ రెండో పంటగా వేసవిలో ఉపాధి కల్పిస్తుందని, అటువంటి తునికాకు సేకరణ ప్రక్రియను ప్రారంభించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. ఇప్పటికే తునికాకు టెండర్లు పూర్తిచేసి ప్రూనింగు పనులు ప్రారంభించవలసి ఉండగా నేటికీ టెండర్లు పిలవకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర అటవీ శాఖామంత్రికి, అధికారులకు ఇప్పటికీ వినతి పత్రాలు సమర్పించినప్పటికీ టెండర్ల ప్రక్రియను ప్రారంభించకపోవడం సరైంది కాదన్నారు. ప్రక్రియను ప్రారంభించి గిరిజనులను, ఇతర సామాజిక పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పేదలను సమీకరించి ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోతు వెంకన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు లింగోజు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయాలి

- వెల్ఫేర్ బోర్డు సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత




నవతెలంగాణ-మహబూబాబాద్

ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని, వెల్ఫేర్ బోర్డులో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వెల్ఫేర్ బోర్డు ఆన్‌లైన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ అధికారి ధారావత్ హాల్యానాయక్‌కు అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాడబోయిన శ్రీశైలంలు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించే క్రమంలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తామని ప్రకటన చేసిందని, అలా కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరికి ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ఆన్‌లైన్ అప్‌డేట్ పేరుతో గత 6 నెలల నుండి నిలిపివేశారని, దానితో పేర్లు నమోదు చేసుకోవడానికి, రెన్యూవల్, క్లెయిమ్ కోసం కార్మికులు ఇబ్బంది పడుతున్నారని కావున వెంటనే బోర్డు ఆన్‌లైన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. వెల్ఫేర్ బోర్డు సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాల నాయకులతో సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాబోయే కాలంలో సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, బానోతు శంకర్, గుణగంట్ల రాము, ఐలయ్య, శ్రీశైలం, భూక్యా రాము తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కరపత్రాల ఆవిష్కరణ



నవతెలంగాణ-మహబూబాబాద్

ఫిబ్రవరి 27, 28 తేదీలలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, అన్ని మండలాల్లో నిర్వహించే పదవ తరగతి ప్రతిభ పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖాధికారి దేశి రామ్ నాయక్‌లు తెలియజేశారు. ఈసందర్భంగా మంగళవారం ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ రామారావు, డీడీ దేశ్‌రామ్‌నాయక్‌లు కరపత్రాలను ఆవిష్కరించారు.. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్ వలన విద్యార్థులకు ఉపయోగం కలుగుతుందని తెలియజేశారు.. ఈటాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగిస్తుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ సంఘం బాధ్యులు ఇలాంటి టాలెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో జీసీడీవో విజయలక్ష్మి, ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు గంధసిరి జ్యోతిబసు, పట్ల మధు, జిల్లా ఉపాధ్యక్షులు సింహాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి నిక్షిప్త, జిల్లా నాయకులు రాకేష్, వీరేందర్, సురేష్, చందు, దేవేందర్ వినయ్‌లు పాల్గొన్నారు..

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-కేసముద్రంరూరల్:

కేసముద్రం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తహసీల్దార్ ఆఫీస్ లో తహసీల్దార్ దామోదర్‌కు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) పార్టీ మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, ఉపాధి హామీ కూలీలకు, నిరుద్యోగులకు ఆమోదయోగ్యంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సబ్బండ వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా వెంటనే సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు చాగంటి కిషన్, జల్లే జయరాజు, వేల్పుగొండ సావిత్ర, సోమారపు ఎల్లయ్య, లక్ష్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయుల పాలనకు సాక్ష్యంగా నిలిచిన బయ్యారం పెద్ద చెరువు..

- మండల రైతాంగానికి జీవనాధారం
- ప్రకృతి సిద్ధంగా నిండుతున్న పెద్ద చెరువు
- బయ్యారం-గార్ల మండలాల రైతాంగానికి వరం





నవతెలంగాణ-బయ్యారం:

సుమారు 800 ఏండ్ల క్రితం కాకతీయుల చరిత్రకు నేటికి తెలంగాణలో ఆనవాళ్లు కనబడుతున్నాయి. ప్రజాహితం కోసం చేసిన ప్రజోపయోగమైన పనులు, ప్రాజెక్టులు ఇప్పటికీ ప్రజావసరాలుగా వర్ధిల్లుతున్నాయి. పాలకులు మాత్రం వాటిని గుర్తించి నేటి ప్రజలకు అవసరమైన రీతిలో అభివృద్ధి పరచడంలో వెనుకంజలోనే ఉంటున్నాయి. తెలంగాణలోని ఓరుగల్లు జిల్లాలో కాకతీయులు 11 నుండి 12వ శతాబ్దం వరకు తవ్వించిన చెరువులు (తటాకాలు) నేటికి కొన్ని అభివృద్ధికి. నోచుకుంటుండగా మరికొన్ని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒకటిన్నర టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన చెరువుల్లో చెప్పుకోదగినవి రెండు మూడే ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాకాల, రామప్ప, లక్నవరం సరస్సులు ఒకటి నుండి రెండు టీఎంసీల లోపు నీటి సామర్థం కలిగిన తటాకాలుగా ఉన్నాయి. అవి కాకుండా గణప సముద్రం, కేసముద్రం లాంటి చిన్నతరహా చెరువులు కూడా ఉన్నాయి. ఒకటిన్నర టీఎంసీల నీటి సామర్థం ఉన్న సరస్సులలో బయ్యారం పెద్ద చెరువు సరస్సు కూడా ఉంది. ఆ సరస్సును నాటి నుండి నేటి వరకు అభివృద్ధి చేయడంలో ఎవరు కూడా ముందుకు రాలేదు. బయ్యారం అడవుల్లో నిక్షిప్తమై, అపారమైన ఖనిజ సంపద దేశవ్యాప్తంగా గుర్తింపును పొందింది. ఆ ఖనిజ సంపదను వెలికి తీసి చుట్టూ ఉన్న ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎన్నికల ముందు రాజకీయ ప్రధాన అస్త్రంగా మారింది. అయితే ఆఖనిజ సంపద గుట్టలను ఆనుకొని ఉన్న బయ్యారం చెరువు దాని చరిత్ర, శిథిలమై పోతున్న చరిత్రకు సాక్ష్యం ఉన్నప్పటికి ఎవరు కూడా దానివైపు కన్నెత్తి చూడడం లేదు. బయ్యారం చెరువుకు ఒక విశిష్టమైన చరిత్ర దాగి ఉంది. కాకతీయ రాజుల వంశంలోని మహాదేవుని భార్య బయ్యమాంబ పేరుతో ఆమె కూతురు మైలాంబ తవ్వించిన ప్రధాన తటాకంగా చరిత్రలో నిలిచి ఉంది. పాకాల సరస్సు వెనుక నున్న గుట్టల నుండి జాలు వారిన నీటికి ఆనకట్టను నిర్మించి 20 వేల పైచిలుకు ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే చెరువుగా తీర్చిదిద్దారు. నాటి బయ్యమాంబ చెరువే నేటి బయ్యారం పెద్ద చెరువుగా ప్రసిద్ధికెక్కింది.

- **చెరువు నీర్మాణం తీరు...**

కాకతీయుల పరిపాలనలో సాగు, తాగునీటి కోసం మొదటి ప్రాధాన్యతను ఇచ్చారు. నీటి వనరులున్న ప్రతి చోట గొలుసుకట్టు చెరువులతో పాటు మధ్యతరహా ప్రాజెక్టులను నిర్మించారు. ఓరుగల్లు జిల్లాలోని హన్మకొండ, గణపతి సముద్రం, కేసముద్రం, రామప్ప, లక్నవరం, పాకాల, బయ్యారం చెరువులను తవ్వించారు. ఒక్కొక్కరి పేరు మీద ఒక్కొక్కరి జ్ఞాపకార్థంగా చెరువులను నిర్మించారు. పాకాల సరస్సును గణపతి దేవరాజు పాలనలో మహామంత్రిగా ఉన్న బయ్యన నాయకుని ఆధ్వర్యంలో జగధాల ముమ్మడి నిర్మించారు. పాకల సరస్సుకు ముందే బయ్యారం చెరువును గణపతి దేవుని తల్లికి జ్ఞాపకార్థంగా ఆయన చెల్లెలు మైలమాంబ బయ్యమాంబ చెరువును నిర్మించారు. మహాదేవుని ఇల్లాలు బయ్యమాంబ, ఆ దంపతుల సంతానమే గణపతి దేవ చక్రవర్తి ఆయన సోదరి మైలమాంబ. 11వ శతాబ్దంలో మైలమాంబ తన తల్లీ బయ్యమాంబ జ్ఞాపకం కోసం బయ్యారం తటాకాన్ని తవ్వించి ఆ చెరువుకు బయ్యమాంబ చెరువుగా నామకరణం చేశారు. చెరువు నిర్మాణాన్ని పరిశీలించినప్పుడు ఆసక్తికరమైన ఇంజనీరింగ్ పరిజ్ఞానం కనబడుతుంది. రామప్ప, లక్నవరం, పాకాల, బయ్యారం నాలుగు సరస్సులన్ని కూడా ఒకదానిపై ఒకటి ఆకాశాన్ని తాకినట్లుగా ఉండే కొండలుగా వరుసగా ఉంటాయి. ఆ కొండల నుండి జాలువారిన నీటికి ఆనకట్టలు కట్టి సరస్సులుగా తీర్చిదిద్దారు. బయ్యారం సరస్సు నిర్మాణంలో ఉత్తర భాగంలో వరుసుగా ఉండే కొండలు, దక్షిణ భాగంలో కూడా వరుసగా ఉన్న కొండలు, పాకాల వెనుక ఉన్న కొండల ద్వారా వచ్చే నీరు బయ్యారం చెరువు శిఖంలో కలుస్తుంది. బయ్యారం చెరువు శిఖానికి రెండు వైపులా ఉన్న కొండల నుండి జాలువారిన నీరు భారీ ఎత్తున కష్టానదికి.. తరలిపోతుంది. దాన్ని గమనించి బయ్యారం చెరువు శిఖం కొండలకు ఆనకట్టను నిర్మించారు. ఆ ఆనకట్ట నిర్మాణమే బయ్యారం చెరువుగా మారి వరదగా వెళ్లే నీరు సరస్సుగా మారింది. ఆ చెరువు నీటి ద్వారా ప్రస్తుతం 20 నుండి 30 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. బయ్యారం చెరువుకు జీవనాధారంగా కొత్తగూడ మండలంలోని పందిపంపుల వాగు నీరు ఎప్పటికి జీవనదిగా పారుతూనే ఉంటుంది. వర్షాకాలంలో కొత్తగూడెం మండలంలోని గుట్టల నుండి వచ్చే నీరు మొత్తం బయ్యారం చెరువుకు చేరుకుంటుంది.

- **800 ఏండ్లు గడిచినా గుర్తుకు రాని చరిత్ర..**

కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులన్నింటికి కూడా ప్రభుత్వాలు తగిన గుర్తింపునిస్తూ వాటి మరమ్మత్తులతో పాటు కాలువల ఆధునీకరణకు భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నారు. ఆసరస్సుల ప్రాంతాలన్నీ అటవీ ప్రాంతం కావడం అక్కడ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి కూడా జరుగుతుంది. వాటికి భిన్నంగా బయ్యారం చెరువు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. కాకతీయుల వంశం నుండే పురుడు పోసుకున్న బయ్యారం చెరువు పర్యాటక ప్రాంతానికి దూరంగా ఉంది. బయ్యారం చెరువు చుట్టూఉన్న గుట్టల ప్రదేశాలు ఉత్తరాంధ్రలోని అరకులోయలను గుర్తుకు తెస్తున్నట్లు ఉంటుంది. ఎటుచూసినా ఎత్తయిన గుట్టలు, లోయలతో కూడిన భూములు, వాగులు, వంకలతో సుందరంగా ప్రకతి కనిపిస్తుంది. ఉత్తరాంధ్రలోని అరకులోయలో సోయగాలు ఏవిధంగా ఉంటాయో దాన్ని పోలిన విధంగానే బయ్యారం ప్రకృతి కనబడుతుంది. బయ్యారం చెరువు చుట్టూ అపారమైన ఖనిజ నిక్షేపాలు దాగి ఉన్నాయి. చెరువు శిఖంతో పాటు ఆయకట్టు భూములు, పక్కనున్న ఎత్తయిన కొండలన్ని కూడా ఇనుప రాతి గుట్టలతో పాటు లాటిరైట్, డోలమైట్, సున్నపు నిక్షేపాలు అల్యూమినియం తదితర విలువైన ఖనిజ సంపద ఈ చెరువు శిఖం పరిధిలో దాగి ఉంది. బయ్యారం పెద్ద చెరువు పూర్తిగా ఆదివాసీ గిరిజన సంప్రదాయం మధ్యన దాగిఉన్న ప్రకతి సమూహంగా కనపడుతుంది. అందుకే ఇప్పటి వరకు కూడా అక్కడి ప్రకతి సంపద చెక్కు చెదరకుండా ఉంది. బయ్యారం చుట్టూ పక్కల కోయగిరిజన నివాసాలే ఎక్కువగా ఉన్నాయి. వాటి సంప్రదాయానికి అద్దంపట్టే బయ్యారం చెరువు గత చరిత్రకు సాక్షంగా నిలుస్తుంది. బయ్యారం చెరువు ముందే శిలాశాసనాన్ని కాకతీయులు ఏర్పాటు చేశారు. ఆ శిలపై కన్నడ, తెలుగు, మరాఠి భాష లిపితో చెక్కిన శిలాశాసనం ఉంది. దాని అర్థాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. ఆ శిలా శాసనం ప్రకారం 1105లో బయ్యమాంబకు మైలాంబనే కూతురు జన్మించగా తల్లి జ్ఞాపకార్థంగా బయ్యమాంబ పేరుతో బయ్యారం చెరువును నిర్మించినట్లు ఉంది. కాకతీయుల వంశంలో ఎవరెవరూ ఉన్నారు. వారి పరిపాలన, వంశ వక్షాన్ని కూడా అందులో లిఖించారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల విభజన జరగక ముందు బయ్యారం మండలం ఖమ్మం జిల్లా పరిధిలో ఉంది. జిల్లాల విభజన తరువాత బయ్యారం మండలం మహబూబాబాద్ జిల్లాలోకి వచ్చింది. 2016లో చేపట్టిన జిల్లాల విభజనలో మహబూబాబాద్ జిల్లా పరిధిలోకి బయ్యారం మండలం వచ్చినప్పటికి నియోజకవర్గం మాత్రం ఖమ్మం జిల్లా పరిధిలో ఇల్లందు నియోజకవర్గంలో కూడా కలిసి ఉంది. బయ్యారం సరస్సు మూడు పెద్ద వాగుల నుండి నీరు చేరుతుంది. బయ్యారం చెరువు నుండి విడుదలయ్యే నీరు బయ్యారం, గార్ల, మహబూబాబాద్ మండలాల పరిధిలోని ఆయకట్టు భూములకు నీరు పారుతుంది. బయ్యారం పరిధిలో వినియోగంలోకి వచ్చిన భూమి లెక్కల ప్రకారం అడవీ 1032 హెక్టార్లుండగా వ్యవసాయేతర భూమి 335 హెక్టార్లు, భంజరు భూమి 289 హెక్టార్లు, పశ్చిక ప్రాంతాలు 119 హెక్టార్లు, నికరంగా ఉన్న భూమి 1638, నీటి సౌకర్యం లేని భూమి 2089 హెక్టార్లుగా ఉంది. ప్రధాన పంటలు వరి, పత్తి, పసుపు, మొక్కజొన్న, పొగాకు సాగవుతున్నాయి.

యూరియా బ్లాక్ దందా..!

- కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారస్తులు...
- నామమాత్రంగా తనిఖీలు..



నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

తొర్రూర్ డివిజన్‌లో యూరియాను బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముతూ రైతులకు ఆర్థిక నష్టాన్ని కలిగిస్తూ రైతును నట్టేట ముంచుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ పోనూ ఒక యూరియా బస్తా కు రూ.270 లకు అమ్మాల్సిన వ్యాపారస్తులు అత్యధికంగా రూ.300 నుండి రూ.320లకు అమ్ముతూ యూరియాతోపాటు ఫర్టిలైజర్ మందులు కొంటేనే యూరియాను ఇస్తున్నారు. లేకపోతే యూరియా లేదంటూ రైతులను వెళ్లగొడుతున్నారు. దీంతో గత్యంత్రం లేక అత్యధిక ధరలకు యూరియాను కొనుగోలు చేస్తున్నారు. తొర్రూర్ డివిజన్‌లో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ప్రస్తుత ఈసీజన్‌లో మొక్కజొన్న, వరి రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని తొర్రూర్‌లో ఉన్నటువంటి ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ సంబంధిత షాపుల యజమానులు యూరియా కొరత సృష్టిస్తూ బ్లాక్‌లో అధిక ధరలకు అమ్ముకుంటూ, యూరియాతోపాటు తప్పనిసరిగా ఏదో ఒక ఫెస్టిసైడ్స్ కొంటేనే యూరియా ఇస్తామని డిమాండ్ చేస్తున్నారు. ఆ విధంగా కొనుగోలు చేసినా కూడా ఒక్కొక్క యూరియా బస్తాలపై దాదాపు రూ.50 నుండి రూ.70ల వరకు అధికంగా డబ్బులు వసులు చేస్తున్నారు. ఈసందర్భంలో రైతులు తప్పనిసరి పరిస్థితిలో సంబంధిత మందులు కొనుగోలు చేసుకుని ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక ధరలకు అమ్ముతున్న విషయం తెలిసినా జిల్లా వ్యవసాయ అధికారులు నామ మాత్రంగా షాపులపై తనిఖీలు చేసి తమకు రావాల్సిన చేతి వాటాన్ని తీసుకుంటూ షాపు యజమానులను ప్రోత్సహిస్తున్నారు. అలాగే నామ మాత్రపు తనిఖీలతో రశీదులు ఉంటేనే అమ్మాలని చెబుతూ దాటవేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ ఈవిషయంపై స్పందించి జిల్లా వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేసి అధిక ధరలకు అమ్ముతున్న షాపులపై తనిఖీలు చేపట్టి వారిపై తక్షణమే చర్యలు తీసుకొని వారికున్న లైసెన్స్‌లను రద్దుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తొర్రూర్ డివిజన్ లోని రైతులు కోరుతున్నారు.

రైతులకు విరివిగా యూరియా అందజేయాలి..



రైతులకు విరివిగా యూరియా అందజేసి అధిక రేట్లకు అమ్మకుండా చూడాలి. తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ప్రైవేట్ ఫర్టిలైజర్స్ యజమానులు రూ.300 చొప్పున అమ్ముతున్నారు. వీరిని కట్టడి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అధిక రేట్లకు అమ్ముతున్నారని తెలిసి కూడా పట్టిం చుకోవడం లేదు. జిల్లా స్థాయి అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్ళిపోతున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్ప టికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యూరియా అధిక రేట్లకు అమ్మకుండా చూడాలి.

-ఆలకుంట్ల సాయన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు

మహిళలు ఎంట్రాపెన్యూర్లుగా ఎదగాలి



- మహిళా సంఘాల బలోపేతానికి నాబార్డ్ కృషి
- నాబార్డ్ తెలంగాణ సీజీఎం ఉదయ్ భాస్కర్

నవతెలంగాణ-పెద్దవంగర:

మహిళలు ఎంట్రాపెన్యూర్లుగా ఎదగడానికి నాబార్డ్ అన్ని విధాల ప్రోత్సహిస్తుందని తెలంగాణ సీజీఎం ఉదయ్‌భాస్కర్ అన్నారు. లక్ష్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మిల్లెట్ ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఏజీఎంలు చంద్రశేఖర్, రవి తంగర తో కలిసి సందర్శించారు. మిల్లెట్‌తో తయారుచేసిన ఆహార ఉత్పత్తులను ఆయన పరిశీలించి, తయారీ, బాండింగ్, మార్కెటింగ్, ప్యాకింగ్, నిర్వహణ మూలధనం, ఖాతా పుస్తకాల నిర్వహణ వంటి పలు అంశాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తల్లూరి లత, చైర్మన్ తల్లూరి శంకర్‌లతో కలిసి మాట్లాడారు. మహిళా సంఘాల బలోపేతానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మహిళలు మిల్లెట్ ఆహార తయారీ ఉత్పత్తులపై మాత్రమే దృష్టి సారించకుండా, వాటి మార్కెటింగ్ అంశాల పైన కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల యొక్క అభిరుచి మేరకు ఆహారపు ఉత్పత్తులను తయారు చేసి విక్రయించాలన్నారు. వీటి ఉత్పత్తులు కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా, పట్టణ ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే విధంగా నాణ్యతతో కూడిన మిల్లెట్ ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. ఎగ్జిబిషన్లు, పట్టణ కేంద్రాల్లో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి, మిల్లెట్ ఆహార ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. ఈకేంద్రాన్ని ఒక సంస్థగా నమోదు చేసుకొని, వాటి కార్యకలాపాలు చేపట్టడం ద్వారా లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ప్రజలు చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. గ్రామీణాభివృద్ధిలో నాబార్డ్, ఎన్జీవో సంస్థలు అందిస్తున్న పాత్ర సద్వినియోగం చేసుకొని ఆర్థిక వృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో మహిళలు శ్రీరాంశెట్టి ప్రశాంతి, నాగమణి, మంగమ్మ, లలిత, అమత, గౌతమి, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి


- డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్
- లక్ష్మీనర్సింగ్‌హోం తనిఖీ..


నవతెలంగాణ-మహబూబాబాద్




వైద్యం కోసమే వచ్చే రోగులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గుండాల మురళీధర్ మహబూబాబాద్ పట్టణంలోని ప్రైవేట్ వైద్యులను ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. మురళిధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయకుమార్‌ల ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని లక్ష్మీ నర్సింగ్ హోంను తనిఖీ చేశారు. ఈసందర్భంగా లక్ష్మీ నర్సింగ్ హోంలో వైద్యుడు డాక్టర్ ఇంద్రసేనారెడ్డి, వారు అందించే సేవలకు సంబంధించి తీసుకునే రుసుముల పట్టికను అందరికీ తెలిసే విధంగా తెలుగులో రుసుముల వివరాలు తెలియపరచాలని జిల్లా వైద్యాధికారి అన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా మాట్లాడాలని, స్కానింగ్ సెంటర్లలలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు, గైనకాలజిస్టు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమన్నారు. ఈ తనికీలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్ కుమార్, ఆరోగ్య విద్యా బోధకులు కేవీ రాజు సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యా వనరుల కేంద్రంలో.. నీటి ఎద్దడి..!







- సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు..

నవతెలంగాణ-గూడూరు

మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో నీటి ఎద్దడి సమస్య కొనసాగుతుంది. సంవత్సరాలుగా మండల విద్యా వనరుల కేంద్రంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తింది. ప్రాంగణంలో ఉన్న బోరు కాలిపోవడం వల్ల రిపేర్ చేయించేవారు, పట్టించుకునే వారు లేకపోవడం వల్ల సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడిలాగే దర్శనమిస్తుంది. తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. మండల విద్యా వనరుల కేంద్రం పరిధిలోని ఐదు కాంప్లెక్స్‌లకు సంబంధించిన మండల పరిషత్, యూపీఎస్ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తూ ఉంటారు. విద్యాశాఖకు సంబంధించిన ఆయా పాఠశాలలకు సంబంధించిన నివేదికలైన, సమావేశాలు ఉన్నా తప్పనిసరిగా ఎమ్మార్సీకి రావాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎమ్మార్సీ పరిధిలో పనిచేసే సీఆర్పీలు కూడా నిత్యం ఎమ్మార్సీ కేంద్రంగా విధులు నిర్వహిస్తూ ఉంటారు. కాని అక్కడ నీటి సమస్య తలెత్తడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం నిరుపయోగంగా మారిన బోర్‌ను రిపేర్ చేయించి ఉపయోగంలోకి తీసుకువద్దామనే ఆలోచనలో కూడా విద్యాశాఖ అధికారులు లేకపోవడం గమనార్హం. నీటి సమస్య తలెత్తడంతో ప్రాంగణంలో ఉన్న బాత్ రూంలకు తాళం బిగించారు. దీంతో మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చి వెళ్లే ఉపాధ్యాయులకు సమస్య నెలకొంది. మహిళా ఉపాధ్యాయులైతే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదైనా అత్యవసరమైనట్లయితే పక్కనే ఉన్న ఇంటి నుండి బకెట్ల ద్వారా నీటిని తీసుకువచ్చి ఉపయోగించుకుంటున్నట్లు తెలిసింది. తక్షణమే అధికారులు పాడైపోయిన బోర్లు రిపేర్ చేయించి వినియోగంలోకి తీసుకువచ్చి మండల విద్య వనరుల కేంద్రంలోని నీటి ఎద్దడిని నివారించాలని ఉపాధ్యాయునిఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

పాడైపోయిన బోర్‌ను రిపేర్ చేస్తాం. వినియోగంలోకి తీసుకొస్తాం ...

ఎమ్మార్సీలో గత కొన్ని సంవత్సరాలుగా రిపేరుకు నోచుకోని బోర్‌ను రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో నీటి ఎద్దడిని నివారించేందుకు తక్షణమే రిపేర్ చేయించేందుకు కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించానన్నారు. త్వరలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడుతామని తెలిపారు.

-మండల విద్యాధికారి రవికుమార్

మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషి చేయాలి

ఎంపీకి వినతి

నవతెలంగాణ-గార్ల:

స్థానిక రైల్వే స్టేషన్‌లో మణుగూరు ఎక్స్ ప్రెస్ రైలును యధాతథంగా నిలుపుదలను పునరుద్ధరించాలని మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ పోరిక బలరాంనాయక్ కు ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షులు ఎంఏ జలీల్ మంగళవారం వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంపీ బలరాం నాయక్ రైల్వే జీఎంతో మాట్లాడి మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఫారెస్ట్ రేంజర్ రవి

నవతెలంగాణ-మహదేవపూర్



మహాదేవపూర్, కాటారం రేంజ్ పరిధి నస్తురుపల్లి గ్రామ సమీపంలో గత 15 రోజుల క్రితం పెద్దపులి సంచారం కలకలంతో ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గూడూరు, దామరకుంట, గంగాపురి, గుంట్రాజ్‌పల్లి, అటవీ ప్రాంతాలలో పులిజాడ కనిపించడంతో ఫారెస్ట్ అధికారులు పాదముద్రలు ఉన్నట్టు తెలిపారు. తాజాగా మంగళవారం ఉదయం మండలంలోని పలు గుల అటవీ ప్రాంతంలో పులి కనిపించిందనే సమాచారంతో రావడంతో మహాదేవపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి ఆధ్వర్యంలో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడవుల్లో కరెంటు తీగలు, ఉచ్చులు గాని పెట్టకూడదని అన్నారు. పులి కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. అడవుల్లో పులి సంచరిస్తుందని ట్రాక్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మహాదేవపూర్ రేంజ్ పరిధి సెక్షన్స్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.

నగపెల్లిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-కాళేశ్వరం



మహాదేవపూర్ మండలం నాగపెల్లి కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కపరిధిలోని అన్నారం సబ్ సెంటర్ లోని నాగేపల్లి గ్రామములో జిల్లా వైద్య ఆరోగ్య శాఖది కారి డాక్టర్ మధుసూదన్, డాక్టర్ ఉమాదేవి ఆదేశాలతో డాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామములో ఇంటిఇంటికి తిరిగి డ్రై డే చేస్తూ,శానిటేషన్ పరీక్షించి నీటినిల్వలలో టిమోపాస్ వేస్తూ ప్రజలకు దోమలు వ ద్ధి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కలిపించినట్లు వైద్యాధికారి డాక్టర్ సుస్మిత తెలిపినారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ రమ్యసబ్ యూనిట్ ఆఫీసర్ రమేష్, పంచాయతీ ఆఫీసర్ ప్రసాద్, పిహెచ్ఎన్ నీరజ, హెల్త్ అసిస్టెంట్ అడప రాజరమణయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి సురేష్, ఏఎన్ యం విజయ,ఆశ వర్కర్స్ జరీనా, దేవేంద్ర, సంధ్యపంచాయతీ సిబ్బంది రమేష్, సమ్మయ్య, జగదీష్,ప్రజలు పాల్గొన్నారు.



ఇసుక రీచ్ లో పోసుడు... వే బ్రిడ్జిల్లో తీసుడు

నవతెలంగాణ-మంగపేట

ఇసుక రీచ్‌లపై పోలీసులు నిరంతర పర్యవేక్షణకు తోడు అధికారులు నిబంధనలను పక్కాగా అమలు చేస్తుండడంతో ఇసుక ఓవర్ లోడ్ లారీ డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందిగా మారింది. మండలంలోని ఇసుక క్వారీల్లో లోడింగ్ కు వెళ్తున్న లారీలలో నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ ఇసుక నింపుతుండడం అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ క్రమంలోని ఇటీవల మండలంలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ ఎస్ పి శబరీష్‌లు మండలంలోని రాజుపేట కత్తి గూడెం ఇసుక క్వారీలను పరిశీలించి అక్కడి రికార్డులను తనిఖీ చేసి నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇసుక క్వారీల పైన నిరంతర పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించిన విషయం విధితమే. అన్న మాట ప్రకారం పోలీస్ అధికారులు తరచూ ఇసుక క్వారీలను తనిఖీ చేస్తుండడంతో అప్రమత్తమైన లారీ డ్రైవర్లు ఓవర్ లోడ్‌తో ఉన్న తమ లారీలను తనిఖీ చేసుకుంటూ ఇసుక రీచ్ లో పరిమితికి మించి పోసిన ఇసుకను వే బ్రిడ్జిల్లో తీసేస్తున్నారు. మంగళవారం మండలంలోని కమలాపురం గ్రామంలో గల ఓ వే బ్రిడ్జి వద్ద ఇసుక లారీలు పదుల సంఖ్యలో ఆగి లోడు చెక్ చేసుకుని ఓవర్ లోడ్ ఉంటే తొలగించుకోవడం నవతెలంగాణ కంటపడింది.

శాస్త్ర సాంకేతిక అంశాలపై దృష్టిసారించాలి

నవతెలంగాణ-వాజేడు

సాంకేతిక అంశాలపై ఇంటర్నెట్ కు అనుగుణంగా ఉపాధ్యాయులు శాస్త్ర సాంకేతిక అంశాలపై ద ష్టిపెట్టాలని, ములుగు జిల్లా విద్యాశాఖ ఏఎంఓ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం వాజేడు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగిన ఇంటర్ ఆక్ట్ ప్లాన్ ప్యానల్ ట్రైనింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ కేంద్రంలో ఇచ్చే సూచనల ఆధారంగా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, రిసోర్స్ పర్సన్ లు స్వరూప్ సింగ్, జాకిర్ ఆలి లకావత్ బాలాజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు

నవతెలంగాణ-రేగొండ

మండలంలో మంగళవారం రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవాన్ని సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం తాటి వనంలో మండల కేంద్రానికి చెందిన గుండెబోయిన బాబు, గుండెబోయిన రమేష్, బండి రమేష్ ఏటా శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవం పురస్కరించుకొని ఉచితంగా తాటికల్లు పంపిణీ చేస్తుండగా మంగళవారం కూడా పంపిణీ చేశారు.



ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ఆర్టిఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్
కాటారం డివిజన్ కన్వీనర్ కుమార్‌యాదవ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం సబ్ డివిజన్ కేంద్రంతో పాటు అన్ని మండలాలోని అన్ని ,గ్రామాల్లో పలు రకాల విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు సమయం పాటించకుండా ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టిఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్,కాటారం సబ్ డివిజన్ కన్వీనర్ చింతల కుమార్ యాదవ్ ఆరోపించారు.మంగళవారం కాటారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు మోడల్ స్కూల్స్,జిల్లా పరిషత్,ప్రాథమిక,ప్రాథమికోన్నత, మహాత్మ జ్యోతి రావు పూలే, కస్తూరిబాయి తదితర ప్రభుత్వ పాఠశాలల్లో, తాహసిల్దార్. ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఐకెపి.ఇంజనీరింగ్ కార్యాలయాల్లో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమయపాలన పాటించడం లేదన్నారు. ఒక్కోరోజు ఉదయం 11, 12 గంటల సమయాల్లో విధులకు హాజరవు తున్నారని తెలిపారు. దీంతో వివిధ అవసరాల నిమిత్తం కార్యాలాలకు వచ్చే ప్రజలు వారి రాక కోసం గంటల తరబడి చెట్ల కింద కూర్చోవడం జరుగు తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు. మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో ప్లేయర్ సమయంలో కొంతమంది ఉపాధ్యాయులు హాజరవుతున్నారని మిగ తా ఉపాధ్యాయులు హాజరు కాకుండా వారికి నచ్చిన సమయంలో హాజరవు తున్నారని ఆరోపించాడు. జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని శాఖల్లో అధికారులు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఆలస్యంగా హాజరవుతున్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్ గౌడ్

నవతెలంగాణ-టేకుమట్ల

చలివాగులోకి నీటిని విడుదల చేసేందుకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారా యణ రావు ప్రత్యేక దృష్టి సారించి, నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో, ఇరిగేషన్ మినిస్టర్‌తో మాట్లాడి సాగునీరు తెప్పిస్తున్న విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కొంతమంది బీఆర్ఎస్ నాయకులతో వాగు వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కార్చడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ అన్నారు. మంగళవారం టేకుమట్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడారు. చలివాగులోని చెక్ డ్యాం వద్ద కు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వెళ్లి రైతులపై లేని ప్రేమను చూపించడం విడ్డూరంగా ఉందన్నారు.రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు, బీఆర్ఎస్ బడా నాయకులు గుట్టలకు, వ్యాపార కార్యాలయాలకు తీసుకున్న రైతుబంధు డబ్బులు నిజమైన రైతులకు చెందేలా ప్రణాళికల రూపొందించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బదనాం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు మాథం ప్రధాన కార్యదర్శి బండి రవీందర్. కోశాధికారి శాస్త్రాల కిరణ్.బ్లాక్ ప్రధాన కార్యదర్శి బొల్లికొండ రాజయ్య, ఏఎంసీ డైరెక్టర్ కనుమరుగుల సంపత్, నాయకులు తోట గట్టయ్య, పొల్దసరి రాజేశం.సంగి రవి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వైనల యశ్వంత్, కోల్గూరి అనిల్ పాల్గొన్నారు.

గాడితప్పిన అంగన్‌వాడీ కేంద్రాలు

పట్టించుకోని అధికారులు
నిరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-మల్హర్‌రావు



ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతోపాటు పోషకాహారాలు అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో ప్రవేశపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు సమయ పాలన పాటించకపోగా, చిన్నారులను కేంద్రాలకు తీసుకరావడంలో అలసత్వం చేయడంతో కేంద్రాలు వెలవేలబోయి ప్రభుత్వ లక్ష్యం ఆచరణకు నోచుకోకపోగా నిరుగారుతున్న పరిస్థితి తయారైంది. మండలంలో వళ్లెంకుంట సెక్టార్-2 పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలు గాడితప్పాయి. సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు,ఆయాలు సకాలంలో రావడం లేదు. కేంద్రాల్లో చిన్నారులు లేక వెలవెలబోతున్నాయి.మంగళవారం నవ తెలంగాణ పరిశీలనలో నమ్మలేని నిజాలు వెలుగు చూశాయి. పాత రుద్రారం అంగన్‌వాడి కేంద్రంలో టీచరు, ఆయా హాజరైయ్యారు కానీ కేంద్రంలో ఇద్దరే చిన్నారులు కనిపించారు. రుద్రారం సెంటర్-1లో ఆయా మాత్రమే హాజరై టీచర్ హాజరు కాలేదు.చిన్నారులు మాత్రం ముగ్గురే ఉన్నారు.శభాష్ నగర్ లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఒక్కరూ కూడా లేకపోగా ఉదయం 11 గంటలకు కేంద్రం తాళాన్నీ టీచర్ తీయడం కనిపించింది. ఎడ్లపల్లి సెంటర్-1లో ఉన్న టీచర్ పదవి విరమణ పొందగా,కేంద్రంలో ఉన్న ఆయా చిన్నారులను తీసుకరాకపోగా చరవాణిలో మునిగిపోయిన పరిస్థితి కనిపించింది. ఇలా అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి.ఇప్పటికైనా సంబంధించిన అధికారులు కేంద్రాలపై పర్యవేక్షణ చేసి గాడిన పడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పర్యవేక్షణ చేస్తాం : రాధిక, మహాదేవపూర్ ప్రాజెక్టు సీడీపీఓ

అంగన్‌వాడీ కేంద్రాల్లో పర్యవేక్షణ చేస్తాం. టీచర్లు,ఆయాలు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుంటాం. చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకారాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తాం.

భూసార పరీక్షల పై అవగాహన

నవతెలంగాణ-వాజేడు



అధిక మోతాదులో ఎరువులు వాడటం వలన భూమి పొరల్లో ఉన్న సూక్ష్మజీవులు చనిపోయి భూసారం తగ్గే అవకాశం ఉందని, భూసార పరీక్షల ఆధారంగా వ్యవ సాయ అధికారుల సిఫారసు చేసిన పంటలు వేసుకోని, సిఫారసు మేరకు ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ సూచించారు. మంగళవారం వాజేడు మండలంలో అరుణాచల పురం టేకులగూడెం గ్రామాల్లోని రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి వివరించారు. భూమి సారవంతం అయ్యేందుకు జనుము, జీలుగు పిల్లి పెసరి వంటి పచ్చిరొట్ట వేసుకొని, పంటకు ముందు కలియ దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరుగుతుందని,తద్వారా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికరారి హరీష్ జాఫరా పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంను నిలదీస్తాం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్

నవతెలంగాణ-మహదేవపూర్

మీరు ఎంతమందిని జైళ్లలో పెట్టినా పథకాలు అమలు చేసేవరకూ ఖచ్చితంగా రేవంత్‌రెడ్డి సర్కారును, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ అరాచకలను నిలదీస్తామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. పరకాల సబ్ జైలులో ఉన్న మహదేవపూర్ మాజీ ఎంపీపీ భర్త మోహన్ రెడ్డి, కాళేశ్వరం మాజీ ఉపసర్పంచ్ పవన్‌ను మంగళవారం సాయంత్రం పరామర్శించారు. జైలు బయట మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నడపడం చేతకాకనే మాపై కేసులు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు లింగంపల్లి శ్రీనివాస్ రావు,అన్నారి ప్రకాష్, అలీమ్ ఖాన్, మేసినేని రవీందర్రావు , రామ్,లక్ష్మణ్, సునీల్ తదితరులు ఉన్నారు

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-టేకుమట్ల

టేకుమట్ల మండలం బోర్నపల్లి గ్రామంలోని పెండల శ్రీనివాస్ తండ్రి పెండల రాములు అకాల మరణం చెందారు. మృతుడి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల నాయకులు పరామర్శించారు. మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు, నెరెళ్ల రామకష్ణగౌడ్, రేణిగుంట్ల సమ్మయ్య, ఎర్ర సమ్మయ్య మదునయ్య, రాయమల్లు, బక్కయ్య, రవీందర్, రాజమల్లు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థికి బీఆర్ఎస్ సన్మానం

నవతెలంగాణ-టేకుమట్ల

జయశంకర్ భూపాలపల్లి జిల్లావ్యాప్తంగా టీచర్ ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా టేకుమట్ల మండలం టేకుమట్ల కేజీబీవీ పాఠశాలలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. టేకుమట్ల మండలంలో మంగళవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొని ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్‌ను ఘనంగా సన్మానించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక బీఆర్ఎస్ నేతలు మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, చిట్యాల మాజీజెడ్పిటిసి గొర్రె సాగర్, వైస్ ఎంపీ పీ పోతన వేన బలయ్య మాజీ ఎంపీటీసీ ఆది రఘు, మాజీ సర్పంచులు ఉద్దమారి మహేష్, బిలకంటి ఉమేందర్రావు, రాజేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి రూ.10,200 విరాళం

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని రాపల్లికోట లో హనుమాన్ గుడి నిర్మాణం పనులను పునర్ ప్రారంభించడానికి రాపల్లికోట యువత, మేధావులు ముందుకు వచ్చారు. మొదట రాపల్లికోట హనుమాన్ టెంపుల్ నిర్మాణం పనుల కొరకు కాత్రేవుల నవీన్‌యాదవ్ రూ.10,200 విరాళంగా మంగళవారం అందజేశారు. గుడి నిర్మాణంకు దాతలు ముందుకొచ్చి సహాయం అందించాలని దేవస్థానం కమిటీ సభ్యులు కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆదరించాలి

అదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్

నవతెలంగాణ - ములుగు

ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆదరించాలి : అదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్ కోరారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. బీజేపీ అదిలాబాద్ ఎంపీ గోడే నగేష్, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి పాల్గొని ప్రసంగించారు. సరోత్తం రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలపై చాలా కాలంగా పోరాటం చేశారని, ఉపాధ్యాయుల సమస్యలు,ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తి అన్నారు. బీఆర్ఎస్ అధికారం లో ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు ఏమి చేయలేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నో హామీలు ఇచ్చి ఏమీ చేయలేని పరిస్థితిలో ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంను ఆదరిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అధ్యక్షులు, చింతలపూడి భాస్కర్ రెడ్డి,ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా అధికార ప్రతినిధి సూర్య దేవర విశ్వనాద్, కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, సీనియర్ నాయకులు తక్కళ్లపల్లి దేవేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని మెజారిటీతో గెలిపించేందుకు కష్టి చేయాలని అదిలాబాద్ జిల్లా ఎంపీ గోడెం నగేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తమ్ రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి లక్ష్మణ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భర్త పురం నరేష్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి సురేందర్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల రాంబాబు జిల్లా కార్యదర్శి పోదాం రవీందర్, కౌన్సిల్ మెంబర్స్ సలేందర్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి ఓంప్రా, జంగా హనుమంత రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధబోయిన సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం ఐటిడిఏ : బీజేపీతోనే గ్రామాల అభివద్ధి జరుగుతుందని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ గోడె నగేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు వినుకోళ్ల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. బీజేపీ వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తమరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. పల్లా బుచ్చయ్య, సురేందర్, రవీందర్, జనార్ధన్, సమ్మక్క, సంగీత, సంపత్, ప్రణయ్, రాకేష్, ఆనంద్, కిషన్, శ్రీనివాస్, అజిత్, ఎర్రల్ల ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండలంలో కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ నియోజకవర్గ గ్రాడ్యువేట్,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టర్ ఆవిష్కరించారు. మంథని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రభారీ రావుల రాజేందర్ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్స్‌కు గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ నిరద్యోగ భ తి ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులను మభ్యపెట్టి మోసం చేశాయన్నారు. ఈ రాష్ట్రం లో ప్రతిపక్ష పాత్ర పోషించాలంటే బీజేపీ గ్రాడ్యువేట్ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య లను మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి కోరారు. బీజేపీ మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ ఆకుల శ్రీధర్, పచ్చిస్ ప్రభారీలు, వంశీ, శ్రవణ్, సాగర్ల రవి,సంతోష్, నాగుల సాయి శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని ఓడించాలి : ప్రజా సంఘాలు

నవతెలంగాణ-మల్హర్‌రావు(కాటారం)



కరీంనగర్ నిజాంబాద్ మెదక్ అదిలాబాద్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డిని ఓడించాలని ప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, దయ్యం పోచయ్య, అక్కల బాపు యాదవ్, ఐత బాపు పిలుపునిచ్చారు. కాటారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలంగాణ.ఆంధ్ర ప్రదేశ్ వ్యాప్తంగా సుమారుగా 60, బ్రాంచీలను నడిపిస్తున్నాడని, అందులో చదువుకున్న విద్యార్థులను ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నిరుద్యోగుల సమస్యలపై కనీస అవగాహన లేని వ్యక్తి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే ఆయన విద్యా సంస్థల అభివృద్ధి కోసమే పని చేస్తాడని, తప్ప గ్రాడ్యుయేట్స్ గురించి కౌన్సిల్లో ఎలాంటి ప్రస్తావన తీసుకురాడని ఆరోపించారు.

చలో విద్యుత్ సౌదాను జయప్రదం చేయండి

టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ రాజు

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి

ఈ నెల 20న తలపెట్టనున్న చలో విద్యుత్ సౌదాను జయప్రదం చేయాలని టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ తిప్పారపు రాజు పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సెక్షన్ ఆఫీస్‌లో జరిగిన ఆర్టిజన్ చైతన్య సదస్సులో మాట్లాడారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయాలని విద్యార్హతను బట్టి ఐటిఐ చేసిన వారికి జేఎల్ఎం, డిగ్రీ చేసిన వారికి జూనియర్ అసిస్టెంట్, టెన్త్ క్లాస్ చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్, డిప్లమో చేసిన వారికి సబ్ ఇంజనీర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నికల ముందు ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా వినతి పత్రం ఇచ్చినట్లు గుర్తు చేశారు. కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కన్వర్షన్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జేఏసీ జిల్లా కన్వీనర్ మోత్కూరి కోటి మాట్లాడుతూ ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డికి పాదయాత్ర చేసిన సమయంలో కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చిన సమయంలో గుర్తు చేశారు. సానుకూలంగా స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఖచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి14 నెలలు దాటిన కార్మికుల సమస్యలు తీర్చలేదన్నారు. ఆర్టిజన్ కన్వర్షన్ సాధనలో భాగంగా అనేక ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా స్పందన లేదని, ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ చేయకపోతే భవిష్యత్తులో మెరుపు సమ్మెకు వెళ్లడానికి వెనకడబోమన్నారు. ఈనెల 20న చలో విద్యుత్ సౌధ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, దేవేందర్ రెడ్డి, మోతే బాబురావు, సామర్ల బిక్షపతి, మహేందర్ రెడ్డి, చంద్రయ్య, ప్రసాద, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని సన్మానించిన సహకార బ్యాంకు చైర్మన్లు

నవతెలంగాణ-మహదేవపూర్

సహకార బ్యాంకు చైర్మన్ ల పదవి కాలం పొడగించిన సందర్భంగా సోమవారం రాత్రి మంథని కేంద్రంలో రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబుని మంథని నియోజకవర్గం పాక్స్ చైర్మన్ లు మహదేవపూర్ చల్లా తిరుపతి రెడ్డి మంథని,కొత్త శ్రీనివాస్ కమాన్పూర్, ఇనగంటి భాస్కర రావు, బయ్యపు మనోహర్ రెడ్డి కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

కులగణన దేశవ్యాప్తంగా నిర్వహించాలని కాంగ్రెస్ ఆలోచన

ఎంపీడీకే అరుణ కూడా బీసీ గణనలో పాల్గొనాలి
ములుగు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి.భగవాన్ రెడ్డి

నవతెలంగాణ - ములుగు



బిసి లపై బిజెపి ప్రభుత్వం కపటప్రేమను కనబరుస్తుందని ములుగు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి.భగవాన్ రెడ్డి అన్నారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ ఎంపీ డీకే అరుణ మాట్లాడిన మాటలను,త్రిప్పికొడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన గురించి మాట్లాడటం సరికాదన్నారు.కులగణన అనేది కేవలం రిజర్వేషన్లు కల్పించడం కోసమే అన్నారు. గ్రామాలలో ఎన్నికల సమాయర్ధమై ముఖ్యమంత్రి కులగణన చేపించగా,దానిలో కూడా కొందరు కావాలనే పాల్గొనలేదు.మళ్ళీ డీకే అరుణ మాట్లాడుతూ కులగణనలో ఆదాయం లెక్కలు ఎందుకు అన్నారు.ఏదైనా పథకాల లబ్దికై వార్షిక ఆదాయం లెక్క గట్టటం మంచిదే కదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2 సార్లు మంత్రి పదవిని చేపట్టి తెలంగాణా రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే,ఆస్తులను కాపాడుకోవడానికి బిజెపి పార్టీ లో చేరారు. ఆస్తులను కాపాడుకునేందుకు అనునిత్యం రంగులుమార్చే ఊసరవెల్లిలా పార్టీలు మార్చే మీరు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హతలేదు.అవకాశం కల్పించిన వారిని మోసం చేయటం అలవాటుగా మార్చుకున్న మీకు మళ్ళీ పార్టీలు మార్చటం జెండాలు మార్చటం మీకు ఒక లెక్కా!మిమ్మల్ని నమ్మి మీకు ఓట్లు వేసిన ప్రజల నమ్మకాన్ని తుంగలో తొక్కిన మీరు ఇంకా వేరొక పార్టీ అధికారంలోకి వస్తే,మళ్ళీ పార్టీ నమ్మకం ఉన్నదా ఎంపీ అరుణ కాబట్టి,కల్లిబొల్లి మాటలు కట్టిపెట్టి,కులం-మతం పేరుతో రాజకీయం చేయటం మానేసి, ఇప్పటికైనా స్థిరమైన రాజకీయం నేర్చుకుంటే బాగుంటుందని అన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

మద్యం సేవించి వాహనాలు నడపరాదని భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో భూపాలపల్లి కి చెందిన అల్వాల వంశీ (32)ను మంగళవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపవద్దని అన్నారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ-గణపురం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో మార్చి 8 న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించబడతాయని డిప్యూటీ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ, జి ప్రియాంక తెలిపారు. చెల్పూర్ చౌరస్తాలో మంగళవారం ప్రజలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ వ్యాన్లో చౌరస్తాకు చేరుకున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ బృందం చిరు వ్యాపారులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనకబడిన మరియు నిమ్న కులాల వారికీ, మహిళలకు, వయో వ ద్ధులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ లక్ష్యమని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను డీఎంహెచ్ఓ సందర్శన

నవతెలంగాణ-వాజేడు

ఇటీవల జ్వరంతో మరణించిన సోయం వినీత్ మరణానికి కారణాలపై విచారంలో భాగంగా ములుగు జిల్లా విద్యాధికారి గోపాల్‌రావు మంగళవారం వాజేడు మండలం పేరూరు ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యా ర్థులకు సంబంధించిన ఆరోగ్య (సిక్)రికార్డులను తనిఖీ చేసి పిల్లలకు ఎటు వంటి జబ్బులు వస్తున్నాయి ? ఏమి మందులు ఇస్తున్నారని అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌ను సందర్శించి తగు సూచనలు చేశారు. అనంతరం పేరూరు, వాజేడు వైద్య శాలల వైద్య సిబ్బందికి జాతీయ కార్య క్రమాల మీద సమీక్ష చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీ సర్ డాక్టర్ చంద్రకాంత్ వైద్యులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదయ్యకు గోవింద్‌నాయక్ పరామర్శ

నవతెలంగాణ - ములుగు



వెంకటాపూర్ మండలం పట్వారీ పల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అబ్బన బోయిన సదయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడు తుండగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ మంగళవారం సదయ్య ని కలిసి ఆయన యొక్క ఆరోగ్య యోగక్షేమం తెలుసుకొని ఏమి ఆధైర్య పడవద్దని, పార్టీ అండగా ఉంటూ ఆదుకుంటుందని ఆయనకు భరోసా ఇచ్చారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
మహబూబాబాద్
బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-బయ్యారం:
గ్రామపంచాయతీలో నెలకొన్న పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కార్యదర్శులు స్థానిక ఎంపీడీవో జి.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పెండింగ్ బిల్లులు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించి గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు రాజ్‌కుమార్, శ్రీధర్, మోతీలాల్, రవి, రమేష్, ప్రియా, శిరీష, హనుమంతు, రాంబాబు, ఆనురాధ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఈటెల రాజేందర్ ప్రచారం



నవతెలంగాణ-గూడూరు
మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ ఈటెల రాజేందర్ మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారం నిర్వహించారు. పాఠశాలలోని ఉపాధ్యాయినీలతో మొదటి ప్రాధాన్యత బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్‌రెడ్డికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, భాస్కర్‌రెడ్డి, జిల్లా నాయకులు చిలుపూరు వెంకన్న, మేరెడ్డి సురేందర్, రాంబాబు, మల్లేష్‌యాదవ్, చెల్పూరి శ్రీశైలం, సోము నాయకులు పాల్గొన్నారు.



సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ దిలీప్‌కుమార్

నవతెలంగాణ-గార్ల:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్యాంక్ అను సంధానంతో నెహ్రూ సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వినియోగదారుల సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ దిలీప్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోస్టు కార్యాలయం రోడ్డులో డ్రీమ్ ఆన్‌లైన్ సెంటర్ నందు వినియోగదారుల సేవా కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పెరిగిన ఎస్‌బీఐ వినియోగదారులకు బ్యాంక్ సేవలు మరింత సౌకర్యవంతంగా అందించడానికి ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని వినియోగదారులు ఈసదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు బోగ్గారపు నాగేశ్వరరావు, బ్యాంక్ సిబ్బంది సాయి, వినియోగదారులు అఫ్జల్‌మియా, బి.హరి, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి నాయకుల పరామర్శ..

నవతెలంగాణ-గూడూరు
ఎస్సీ కాలనీ వాసి మైదం ఎల్లయ్య భార్య సూరమ్మ అనారోగ్యంతో మృతిచెందగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు నాయక్ ఆధ్వర్యంలో పరామర్శించారు పార్థివ దేహానికి నివాళులర్పించి దహన సంస్కారానికి ఆర్థిక సాయం అందజేశారు. ఈపరామర్శలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి ,మహబూబాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చంటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ.రసూల్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాసమల్ల రాములు, పేరాల సురేందర్, హుస్సేన్,హెచ్.మనోజ్, చప్పట్ల రాము, బోడ టంగు, బెజ్జం మధుకర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి మాజీ ఎంపీపీ పరామర్శ..

మండలంలోని ఎస్సీ కాలనీకి చెందిన బీద కుటుంబ వాసి మైదం.ఎల్లయ్య భార్య సూరమ్మ అనారోగ్యంతో మృతిచెందగా మాజీ ఎంపీపీ సునావత్ రమేష్ ఆధ్వర్యంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దహన సంస్కారానికి తక్షణ సాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు హెచ్.శివ, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మందుల ప్రవీణ్, మాజీ సిటీ యూత్ ప్రెసిడెంట్ మండల మల్లేష్, బండారి యుగంధర్, గొడుగు మునీష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

20న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:
ఆరు గ్యారంటీల అమలు కై ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ ఇందిరా పార్కులో జరిగే ధర్నా కు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని ఐఎఫ్‌టీయూ సజ్జనపు సరస్వతి అన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ అనుబంధ కూలీ యూనియన్ నాయకులు జాటోతు మంజుల, వినోద్ విజయ, రజిత, రంగమ్మ, లలిత, రుక్కమ్మ, ప్రమీల, రాధిక, లలిత, పార్వతి, శోభ, కమిలి, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వుడు స్థానాలు కేటాయించాలి



● బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కు వినతి

నవతెలంగాణ-మహబూబాబాద్
బీసీలకు చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యే రిజర్వుడు స్థానాలు కేటాయించాలని శంతన్ రామరాజు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మానుకోటకు విచ్చేసిన మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈవిషయంపై ప్రధాని దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారు. అనంతరం శంతన్ రామరాజు మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి, రాజకీయ, పదోన్నతుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. జనాభాలో సగానికిపైగా ఉండి ఉత్పత్తిశ్రేణి వర్గాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక వెన్నెముకగా బీసీలు ఉన్నారన్నారు. ప్రతిఏటా బీసీలకు బడ్జెట్‌లో నామమాత్రపు నిధులు కేటాయిస్తూ వాటిని పేపర్ల వరకే పరిమితం చేస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వుడు స్థానాలతో పాటు లక్షకోట్లతో బీసీ బ్యాంకును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వందకోట్లున్న బీసీలకు కేంద్రంలో ఒక మంత్రిత్వశాఖ లేకపోవడం సిగ్గుచేటని, తక్షణమే ఆలోటును పూరించాలని సూచించారు. బీసీలను ఓటుబ్యాంకుగా చూస్తే సహించే రోజులు కావన్నారు. బీసీ యువత, మేధావులు చైతన్యవంతులై తమకు జరుగుతున్న అన్యాయాన్ని గొంతెత్తి చాటుతున్నారని హర్షం వ్యక్తంచేశారు. బీసీలంతా కలిసి తమ హక్కుల సాధనలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బీసీ నాయకులు కమ్మగాని కృష్ణమూర్తి, కోలా సత్యం, అలువాల లాలయ్య వీరమల్ల ప్రేమ్‌కుమార్, చుక్కల నరేష్, మల్లం యశ్వంత్, ఎలగలబోయిన శ్రావణ్, తోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ..ఉషాదయాకర్‌రావు జన్మదిన వేడుకలు..



నవతెలంగాణ-పెద్దవంగర:
ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉషా దయాకర్ రావు జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈసందర్భంగా ఆయన మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌సంజయ్ కుమార్‌తో కలిసి మాట్లాడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఉషా దయాకర్ రావు దంపతుల జీవితం ప్రజా సేవకే అంకితమన్నారు. వారు రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు అన్ని విధాల అండగా నిలవాలని ఆకాంక్షించారు. గతంలో ఉషా దయాకర్ రావు నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాలకుర్తి యాదగిరి రావు, మండల ఉపాధ్యక్షుడు కనుకుంట్ల వెంకన్న, జ్ఞానేశ్వర చారి, వేముల రఘు, చింతల భాస్కర్, ఎర్ర వెంకన్న, అనపురం రవి, రాంపాక నారాయణ, జాటోతు సీతారాం, శంకర్, నవీన్, సతీష్, యాకయ్య, కొమరయ్య స్వామి, హరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో ఈటెల ప్రచారం



నవతెలంగాణ-మరిపెడ
ఖమ్మం-నల్గొండ-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయటానికి కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలకు అభ్యర్థులు కరువయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటెలరాజేందర్ విమర్శించారు. మంగళవారం మరిపెడ పట్టణ కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని బలపరిచే విధంగా ఉపాధ్యాయులు బిజెపి అభ్యర్థులకు ఓటు వేయాలని ఈటెల ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గాదె రాంబాబు, యాప సీతయ్య జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు గంగాధర్, పట్టణ అధ్యక్షులు మంగమ్మ లింగం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

పశువుల గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరం

నవతెలంగాణ-గార్ల:
లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ ద్వారా 90 శాతం పైగా ఆడ దూడలను పొందవచ్చని గార్ల, ముల్కనూరు గ్రామాల పశు వైద్యులు వి.సురేష్ కుమార్, శ్రావణ్ కుమార్ లు అన్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో పశుగాణాభివృద్ధి సంస్థ, వైరా జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పాడి పశువులలో ఉచిత గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స శిబిరాన్ని నిర్వహిచారు. ఈ శిబిరంలో 2 పశువులతకు కృతిమ గర్భధారణ, చూడి పరీక్షలు, 32 పశువులకు ఎదకురాని పశువులకు చికిత్స, 24 దూడలకు నట్టల నివారణ మందులు, 8 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు. ఈకార్యక్రమంలో గార్ల, ముల్కనూర్, డోర్నకల్ పశువైద్యాధికారి నాగేశ్వర్‌రావు, సిబ్బంది నర్సింహారావు, శేఖర్, చందులాల్, గోపాలమిత్రలు నగేష్, సంజీవ్, రవి, లక్ష్మణ్, రైతులు బుడిగ మురళి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

నవతెలంగాణ-బయ్యారం:
సీపీఎస్, యూపీఎస్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 2న హైదరాబాద్‌లో జరిగే యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మార్చి 2న హైదరాబాద్ ఇందిరా పార్క్ దగ్గర జరిగే యుద్ధభేరి మహా ధర్నా గోడ పత్రికను ఎంఈఓ దేవేంద్రా చారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షులు బానోతు రవీందర్‌నాయక్, తావు శ్రీనివాస్, సుధాకర్, లక్ష్మీనారాయణ, సునీల్, రామకృష్ణ, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, రవి, ధనుంజయ, లక్ష్మయ్య, అరుణ కుమారి, విజయ, నజీమా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ



నవతెలంగాణ-పెద్దవంగర:
మండలంలోని ఉప్పరగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు వేముల భిక్షపతి, వేముల వెంకన్న, వేముల ప్రభాకర్‌లు వారి తండ్రి రామస్వామి జ్ఞాపకార్థం రూ.20 వేల విలువచేసే వాటర్ ప్లాంట్, పాఠ్య సామాగ్రిని వితరణ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ వర్ధన్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా దాత వెంకన్న మాట్లాడుతూ మా తండ్రి జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్లాంట్, పాఠ్య సామాగ్రిని వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని, ఇతరులకు తోచిన రీతిలో సహాయం చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి, ఇష్టంతో చదివి, పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కుటుంబ సభ్యులు వేముల రాధా, సాంబలక్ష్మి, గ్రామస్తులు దుంపల కుమారస్వామి, దుంపల ఉప్పలయ్య, వేముల రఘు, సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాకాల టూర్‌కు.. గురుకుల విద్యార్థులు

నవతెలంగాణ-పర్వతగిరి
వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రం లోని సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యార్థినిలు మంగళవారం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రోగ్రాంలో భాగంగా పాకాల బొటానికల్ పార్క్‌కు (టూర్) తీసుకు వెళ్లినట్లు, 606 మంది స్కూలు, కాలేజీ విద్యార్థినిలు, స్టాఫ్ వెళ్లినట్లు ప్రిన్సిపాల్ అపర్ణ చెప్పారు. ఈనెల 21న టూర్ లో భాగంగా ముల్కనూరు పాలడైరీ ని విద్యార్థినీలతో కలిసి సందర్శించనున్నట్లు ఆమె చెప్పారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లోబల్ కేరళ స్కూల్ కృషి అభినందనీయం

పోర్ట్‌డే ప్రారంభోత్సవంలో ఎస్సై బి.సతీష్



నవతెలంగాణ-మరిపెడ
అంచెలంచెలుగా ఎదుగుతూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకొచ్చిన గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ కృషి అభినందనీయమని మరిపెడ ఎస్సై బొలగాని సతీష్‌గౌడ్ అన్నారు. మంగళవారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక గ్లోబల్ కేరళ మోడల్ స్కూల్ ఆవరణలో స్పోర్ట్స్ టుడే ను ఆయన జెండా ఆవిష్కరణ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కల్పించడంలో గ్లోబల్ స్కూల్ ముందంజలో ఉందన్నారు. అంతేగాక ఈపాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అవరోదించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్సై గంధ్ర సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ బెన్ని థామస్, డైరెక్టర్లు ఎస్‌కే.అఫ్జల్, జరుపుల కాలునాయక్, పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-బయ్యారం:
అమ్మాయిలను వేధిస్తే కొత్త చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై కె. తిరుపతి అన్నారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపిఎస్ ఆదేశానుసారంగా మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ బాలికలు, బాలుర ఉన్నత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీం ఆర్ఎస్ఐ సునంద, బయ్యారం ఎస్ఐ కె.తిరుపతిలు సంయుక్తంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీ టీం, భరోసా, మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైమ్స్ గురించి వివరించారు. విద్యార్థులందరూ న్యూ క్రిమినల్ లా అండ్ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్ గాని వాట్సాప్ కాల్ గాని మాట్లాడవద్దని, అపరిచిత వ్యక్తులు కాని అపరిచిత గ్రూపుల నుండి వచ్చినటువంటి తెలియని లింకులను ప్రెస్ చేయవద్దని వివరిస్తూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. దీనిలో భాగంగా మహిళలు ఆపద సమయంలో డయల్ 100 సేవలను గాని లేదా షీ టీమ్ నెంబరుకు సంప్రదించాలన్నారు. షీటీమ్ వాట్సాప్ 8712656935 నెంబర్‌కి తెలియచేసినచో తగిన చర్య తీసుకుంటామన్నారు ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్ ఎంఈఓ, హెడ్ మాస్టర్ దేవేందర్, సీనియర్ అధ్యాపకులు ధనుంజయ, జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయురాలు లావణ్య అధ్యాపక సిబ్బంది, షీ టీం సిబ్బంది అరుణ, పార్వతి సౌభాగ్య, రమేష్, భరోసా సిబ్బంది జయశ్రీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ నుండి సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా.. స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులైన వేల పాఠశాలలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా నిర్వహించిన విద్యార్థులు జై.సాయిప్రియ డీఈఓ, ఎన్.నీరజ ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరించి తమ అనుభవాలను మిగతా విద్యార్థులకు సవివరంగా తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా కష్టతరమైన వృత్తి అని, ఉపాధ్యాయుడు ప్రతిరోజు విద్యార్థిగా కష్టపడి చదివి విద్యను బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ప్రాక్టికల్ గా తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు సూర్యనారాయణ, బోళ్ల దురేష్, వినోద్, రాజ్‌నాగయ్య, రవీందర్, శివరాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అంజయ్యకు అభినందనలు



నవతెలంగాణ-మహబూబాబాద్
రెండు నెలల పాటు ఇంటిగ్రేటర్ ఇంటెలిజెన్స్ ట్రెనింగ్ అకాడమీలో ఎస్పీ రామకృష్ణ ఇంటలిజెన్స్ సెక్యూటీ వింగ్ ఆధ్వర్యంలో ట్రెనింగ్ తీసుకుని ఈనెల ఫిబ్రవరి 10నుండి15 తేదీల్లో ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిన 68వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ఆంటీ సబటేజ్ చెక్ రూమ్ సర్చ్ విభాగం వీవీఐపీ, వీఐపీ నివాసం ఉండే రూంను ఎలాంటి హానికర వస్తువులు లేకుండా చూసుకునే విధానంలో తెలంగాణ తరుపున పాల్గొన్న అంజయ్యకు సిల్వర్ మెడల్ ఝార్ఖండ్ ఐజి ఎస్‌కే. సిన్హా చేస్తులమీదుగా అందుకున్నారు. ఇందుకు మహబూబాబాద్ జిల్లా తరుపున జిల్లా సూపర్‌ఇండెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, రిజర్వు డీఎస్పీ, శ్రీనివాస్ విజయ్ ప్రతాప్, అడ్మిన్ రిజర్వు ఇన్స్‌పెక్టర్ అనిల్ కుమార్, బాంబు స్క్వాడ్ సిబ్బంది ఆంజయ్యకు అభినందనలు తెలియజేశారు.

ముగిసిన పదవతరగతి అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ-మరిపెడ



ఈనెల 14వ తేది నుండి 18వ తేది వరకు మరిపెడ మండలంలో గెజిటెడ్ హెడ్ మాస్టర్ అనంతరావు ఆధ్వర్యంలో ఆంగ్ల ఉపాధ్యాయులు బయగాని రామ్మోహన్, గణిత ఉపాధ్యాయులు ఎస్.పవన్ కుమార్ లతో కూడిన ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ టీం, పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో వేసే నిర్మాణాత్మక మూల్యాంకనం, 20 మార్కుల అంతర్గత మార్కుల పరిశీలన సోమవారంతో ముగిసింది. మరిపెడ మండలంలోని జడ్పీహెచ్ఎస్ గుండెపుడి, మహాత్మ జ్యోతిబాపూలే, మరిపెడ జడ్పీహెచ్ఎస్, తానంచర్ల, భారతి విద్యా మందిర్, మరిపెడ, సెయింట్ అగస్టిన్, మాంటిసోరి మరిపెడ, మోడల్ స్కూల్ మరిపెడ, సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ మరిపెడ లో పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల్లో 10వ తరగతి నిర్మాణాత్మక మూల్యాంకనంలో 20 మార్కులను వేసే విషయంలో ఉపాధ్యాయ బృందానికి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఇలా సరి చేసినటువంటి మార్కుల జాబితాను ఈనెల 21వ తేది నుండి 28వ తేది వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. ఈఇంటర్నల్ మార్కుల పరిశీలన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆమెడ అరుణశ్రీ, మరిపెడ మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-గూడూరు
జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆహర్నిశలు శ్రమిస్తున్న జర్నలిస్టుల నాయకుడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మానుకోట జిల్లా అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను గూడూరు మండల టీయుడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు గుర్రం యాకాంబ్రం, జిల్లా ఉపాధ్యక్షులు కోరే పాపయ్య మానుకోట ట్రైబల్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బానోతు లక్ష్మణ్ నాయక్, మండల కోశాధికారి కుందూరు కరుణాకర్‌రెడ్డి, నవనీత్, అజయ్ కుమార్, భీమాని యాదగిరి, కన్న వెంకన్న, శ్రీధర్‌శర్మ, సంతోష్, అంబటి ప్రసాద్ మండల విలేకరులు పాల్గొన్నారు.

వరంగల్

నేటి ధర్నాను జయప్రదం చేయండి



నవతెలంగాణ-పర్వతగిరి
కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల19న(నేడు) వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో జరుగు నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల మౌళిక అవసరాలకు కేటాయింపులు తగ్గించి సంపన్నులకు రాయితీలు చేసిందని, దేశవ్యాప్తంగా తొమ్మిది వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా వామపక్ష పార్టీలు వరంగల్ జిల్లా కేంద్రంలో హెడ్‌పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ కల్పించి భీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐని ఉపసంహరించాలనే పలు డిమాండ్లతో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి చేయూత



నవతెలంగాణ-పర్వతగిరి
మండలంలోని వడ్లకొండ గ్రామంలో అనారోగ్యంతో కొంగ లక్ష్మి, కందికొండ కొమురయ్యలు మరణించగా వడ్లకొండ గ్రామ సీనియర్ నాయకుడు అత్తి కుమారస్వామి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 50 కేజీ ల బియ్యం ఆర్థిక సాయంగా అందించారు. ఈకార్యక్రమంలో పర్వతగిరి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కట్ట శ్రీనివాస్, వడ్లకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వల్లందాస్ నరసయ్య, పంతంగి వెంకన్న, కన్నె రవీందర్, బైరి ఎల్లయ్య, కొంగ కట్టమల్లు, వడ్డే కుమారస్వామి, కందికొండ దేవేందర్, వల్లందాస్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు బియ్యం అందజేత



నవతెలంగాణ-పర్వతగిరి
మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన కొంగ లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మాజీ సర్పంచ్ అమడగాని రాజుయాదవ్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఇదే గ్రామానికి చెందిన కందికొండ కొమురయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కేజీల బియ్యం ఆర్థిక సాయంగా అందజేశారు. ఈకార్యక్రమంలో బైరి వెంకన్న, ఎర్రం రమేష్, కుడికాల సునీల్, బైరి మహేష్, శిరంశెట్టి హరికృష్ణ, దాడి వినయ్, కన్నె హరీష్, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.